# సమర్థ సద్గురు

## ఆధ్యాత్మిక మాసపత్రిక

శ్రీకాళీగార్డెన్స్ ఆశ్రమం - 522508, గుంటూరు జిల్లా

ఫోన్ (0863) 2293645, 2293862, 2293280, 2293206, 9299656267

web : www.mathaji-babuji.org samardhasadguru@rediffmail.com



సంపాదక వర్గము

గూడూరి వెంకట రత్నం

డి.జె. బాలకృష్ణ లాల్

డా॥ఎస్. రామతారక పరబ్రహ్మ శాస్త్రి

మిస్. పి. ఇందిరాదేవి

డా॥ వి.వి. ఆర్ ప్రసాదరావు

డా॥ యమ్. స్వర్ణముఖి



సంపుటి 33 సంచిక 7

పేజీలు 40

మార్చి 2014

5సం॥ల చందా రూ. 250

2సం॥ల చందా రూ. 120

సంవత్సర చందా రూ. 60

విడిప్రతి వెల...... రూ. 5

బ్యాంక్ డ్రాఫ్టు A/C Y.S.C.K.P.M చారిటబుల్ ట్రస్ట్ పేరుతో డ్రా చేయండి.

M.O, బ్యాంక్ డ్రాఫ్టు పంపవలసిన చిరునామా

మేనేజరు

సమర్థ సద్గురు మాగజైన్

శ్రీకాళీగార్డెన్స్ - 522508

printed and published by C.V. Ramana Babu on behalf of YOGINI SRI CHANDRA KALI PRASADA MATHAJI CHARITABLE TRUST and Printed at Samardha Sadguru Publications, D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh and Published at D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh, Editor DUGGIRALA JAGANMOHANA BALA KRISHNA LAL


**ఈ సంచికలో** ............................. ....... **పేజీ**


| | |
|---|---|
| భద్రవాక్యం ........................................ | 2 |
| శ్రీబాబూజీ ఉవాచ | 4 |
| అమ్మమాట అవగాహన చేసుకో | 7 |
| మహాశివరాత్రి | 10 |
| సన్నిధిలో సంభాషణ | 12 |
| యోగవాశిష్ఠము | 14 |
| శ్రీకాళీగార్డెన్స్ కార్యక్రమాలు | 16 |
| గురు సేవ | 17 |
| పరిప్రశ్నేన సేవయా | 18 |
| వందనాలు.....వందనాలు | 19 |
| శ్రీకృష్ణ కర్ణామృతము | 20 |
| సర్వము నీ దయ | 22 |
| వర్ణనాతీతం రామనామ మహాత్మ్యం | 24 |
| శ్రీదత్తాత్రేయ పరశురామ సంవాదము | 26 |
| ప్రాతః స్మరణీయులు -శ్రీలలితానంద సరస్వతి | 28 |
| నీ లీల పాడెద దేవా! | 30 |
| సత్సంగామృతం | 32 |
| ముళ్ళకథ | 35 |
| సమర్థ సద్గురునాధుని దివ్య చరిత్ర | 37 |
| విష్ణు కథలు - 'రోహిదాసు' | 39 |

# భద్రవాక్యం

- పరాశర ప్రసాద్

స యథా సోమ్య వయాంసి వాసో వృక్షం సంప్రతిష్టంతే
ఏవం హవై తత్సర్వం పరే ఆత్మని సంప్రతిష్టంతే

(ప్రశ్నోపనిషత్ చతుర్థ ప్రశ్నః శ్లో॥7)

ప్రశ్నోపనిషత్తు ఆరు ప్రశ్నలతో కూడినది. పిప్పలాచార్యులు తమను ఆశ్రయించిన ఆరుగురు శిష్యులు అడిగిన ప్రశ్నలకు సమాధానంగా చేసిన ఉపదేశమే ఈ ఉపనిషత్తు సారము. మొదటి మూడు ప్రశ్నలు అపరవిద్యకు సంబంధితమైనవి. చివరి మూడు ప్రశ్నలు పరవిద్యకు సంబంధించినవి. అక్షరమైన పరబ్రహ్మ తత్త్వమును వివరించునది పరవిద్య.



సుషుప్తావస్థలో అవిద్య అజ్ఞానము రహితము కాకపోయినా గుణములు రహితము కాకపోయినా గుణములచేత ప్రేరణ చెందే ఇంద్రియాలుపశమించుట చేత మనస్సులో సంకల్ప వికల్పములకు తాత్కాలిక విశ్రాంతి. ఏమీ తెలియని స్థితి సుషుప్తి. ఈ స్థితి నుంచి మేల్కొన్నవాడు నాకు ఏమి తెలియదంటాడు.

నాకు ఏమీ తెలియదన్నది అభావ రూపము, అవ్యక్తము. అందువలన సుషుప్తిలో పొందిన సుఖముగాని, ఆనందముగాని నిత్యము శాశ్వతము కాదు. అది కేవలం తాత్కాలివే. గాలి లేని ప్రదేశములో దీపకాంతి నిశ్చలము మరింత ప్రకాశవంతంగా వుండటం కూడా యిటువంటిదే.

సుషుప్తిలో కలిగే సుఖముగాని, ఆనందముగాని సాధన ద్వారాగాని, మరి యే యితర ప్రయత్నము ద్వారా గాని పొందినది కాదు. నిరుపాధికమయిన సచ్చిదానంద రూపుడు పరమాత్మ. ఉపాదులలో ప్రకాశించే ఆత్మ వస్తువు కార్యాకరణములైన ఇంద్రియాదులను ప్రకాశింపజేస్తూ, ఇంద్రియ కార్యములకు ఆధారమై చూచూట. వినుట మొదలగు క్రియా ధర్మములను పెంపొందించు కన్ను చెవిగా గల యింద్రియ ధర్మాలు కర్తృత్వము ఆరోపించుట అతి సాధారణ విషయము. కాని గాఢ సుషుప్తిలో ఉపాధులు ఉపశమించిన కారణంగా అవన్నీ అక్షరమైన పరమాత్మలో నెలకొనటవే ఆనందహేతువు. ఒక నీటి కుండలో సూర్యుని ప్రతిబింబము కనబడుతోంది. ప్రతిబింబము ఏర్పడటానికి కుండలోని నీరే ఆధారము. కుండలోని నీటిని

తొలగించామనుకోండి ప్రతిబింబము కనబడటానికి అవకాశం లేదు కదా. మరి ఇంతకు పూర్వము కనబడిన ప్రతిబింబము ఏమైనట్లు? అది సూర్యునిలో నెలకొన్నది. ఈ ఉదాహరణని సుషుప్తిలో ఆనంద స్థితికి అన్వయించుకుంటే విషయం అవగతం అవుతుంది. ఉదయం పక్షులన్నీ తమ ఆవాసమైన చెట్టునుండి బయలుదేరి తిరిగి సాయం సమయానికి విశ్రమించటానికి ఆ చెట్టునే చేరుతాయి కదా! అలాగే విరామ సమయంలో యింద్రియాలన్నీ తమకి ఆధారమైన ఆత్మలో నెలకొని ఉండక తప్పదు కదా!

## అత్తవారిల్లు - పుట్టిల్లు

ఒకనాడు ఒక ముసలమ్మ రమణ మహర్షులవారి వద్దకు వచ్చి, తానేమీ చదువుకోలేదనీ, అందువల్ల వేదాంత సారాన్ని సులభంగా తెలిసేట్లు చెప్పవలసిందని వేడుకొంది.

భగవాన్ కరుణాస్వరూపులై ఆ ముసలమ్మకు తత్త్వాన్ని అర్థమయ్యే రీతిలో సరళంగా బోధించారు.

"యుక్తవయస్సు రాగానే ఆడపిల్లకు పెళ్ళి చేస్తారు. అప్పటి వరకూ ఆ భర్త ఎవరో, ఎక్కడివాడో, ఎలాంటివాడో తెలియక పోయినా ఆ భర్తవెంట వెళ్ళటానికి కుతూహల పడుతుంది ఆ పిల్ల. తనను అల్లారుముద్దుగా పెంచిన తల్లిదండ్రుల్నీ స్నేహితురాళ్ళను విడిచి అత్తవారింటికి వెళుతుంది. అక్కడ కొన్నాళ్ళు ఉల్లాసంగా గడుపుతుంది. కొన్నాళ్ళకు విసుగుపుట్టి పుట్టింటికి వెళుతుంది.

అక్కడ కొన్నాళ్ళు ఉండేసరికి అత్తవారింటికి మనసు మరలుతుంది. మళ్ళీ పుట్టింటి మీదకి గాలి మరలుతుంది. ఇదీ వరస. నీకు తెలిసిందే కదా!

అలాగే ఆత్మ నుండి 'నేను' అనే తలంపు పుడుతుంది. అది పుట్టిన చోటునే ఉండక, దేహంలోనికి వచ్చి సుఖదుఃఖాలను అనుభవిస్తుంది. విసుగు కలగగానే తన స్వస్థానమైన ఆత్మను చేరుకుంటుంది. దేహమే అత్తవారిల్లు. ఆత్మే పుట్టిల్లు.

ఇలా యాత్రలు చేస్తున్న మిధ్యా నేను జాగ్రత్తగా గమనిస్తూనే ఉంటే అది శాశ్వతంగా ఆత్మయందే నిలచిపోతుంది. అదే మోక్షము" అన్నారు భగవాన్.

# శ్రీ బాబూజీ ఉవాచ

– పరాశర ప్రసాద్

శ్రీ బాబూజీ మహరాజ్ భక్తులకు బోధ చేస్తూ "భగవంతుడు ఉన్నాడా? అని ప్రశ్నించేవారు కొంతమంది, భగవంతుడు మానవాకారంలో అవతరిస్తాడా? మేము నమ్మము అనేవారు కొంతమంది. ఇటువంటి వారంతా ఒక రకం. కొందరు మేము సత్ పురుషులము, మేము సత్యమార్గాన్ని, ధర్మమార్గాన్ని అనుసరిస్తాము. మేము భగవంతుణ్ణి పూజించి, భజించి, ధ్యానించవలసిన అవసరం ఏముంది అంటారు. ఇటువంటి భావాలు కలగడానికి ముఖ్యహేతువు, మనస్సు యొక్క ప్రవృత్తి సరిగాలేక పోవటం. మానవులు సత్యమార్గాన్ని ధర్మమార్గాన్ని అనుసరించి భగవంతుని వునికిని గురించి ఎన్నడూసందేహించరే! ఎందువలన అంటే భగవంతుడు సత్యస్వరూపుడు కాబట్టి."



శ్రీ బాబూజీ మహరాజ్ ఇంకా మాట్లాడుతూ "మానవుడు పుణ్యకార్యాలు చేయవచ్చు. పుణ్యక్షేత్రాలని దర్శించవచ్చు. అంతేకాకుండా కొంతమంది వారు వున్న ధన, ధాన్యములను, పేదలకు సహాయము చేయవచ్చు ఇవన్నీ మానవుడు ఉత్తమ జన్మను పొందటానికి లేక తాను ఆర్జించిన పుణ్యముద్వారా స్వర్గలోక సౌఖ్యాలు పొందటానికి ఉపయోగ పడవచ్చు కాని వీటి ద్వారా జన్మరాహిత్యం కలుగదు కదా! జన్మరాహిత్యం సాధించవలెనంటే భగవంతుని ఉనికిని విశ్వసించి అన్వేషణ చేయవలసిందే. చదువు బాగా చదివితే డిగ్రీ సంపాదించవచ్చు. శ్రద్ధగా ఉద్యోగం చేస్తే దానిలో ఉన్నత స్థానాన్ని పొందవచ్చు. కాని జన్మరాహిత్యాన్ని పొందవలెనంటే దానిని పొందడానికి మార్గదర్శకుడైన గురువుని ఆశ్రయించవలసిందే."

శ్రీ బాబూజీ మహరాజ్ ఇంకా మాట్లాడుతూ "ఇక్కడ మీకొక ఉదంతం చెపుతాను. విజయవాడలో మన సత్సంగాలు నిర్వహించి నప్పుడు కొంతమంది పండితులు రాత్రి సమయంలో మైకులు పెట్టి సంకీర్తనలు, ఉపన్యాసాలు చేసి నిద్రాభంగం కలిగించడం భక్తి

అనిపిస్తుందా! అంతేకాకుండా కాళీ ఉపాసన చేయమంటున్నారు కదా! అది ఎంతవరకు ఆచరించదగినది అని విమర్శించారు. ఈ విధంగా విమర్శించిన వ్యక్తి కొన్ని రాత్రులు నిద్రలేక చాలా అవస్థపడ్డాడు. కన్నుమూసే సరికి 'కాళీమాతకు జై!' అనే నినాదం వినపడేది భయపడిపోయి మేల్కొనేవాడు. చూశారా! భగవానుడు ఎంత దయామయుడో ఆయన వునికినే శంకించి విమర్శించిన వారిని కూడా ఎదో విధంగా తన దరికిచేర్చుకుంటాడు. దానినే వేదాంత పరిభాషలో 'భ్రమర కీటక న్యాయం' అంటారు.

సాధనలో ప్రతిసాధకుడు కొన్ని ఇబ్బందులు పడక తప్పదు. ప్రతిసాధకుడు తన సాధనకి ప్రధాన అవరోధము బాహ్య ప్రపంచము నుండి సంభవిస్తోందని భావిస్తాడు. కానీ సాధనకి ముఖ్య అంతరాయము మనో ప్రవృత్తి. ఇది కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యములైన అంతఃశత్రువుల ప్రభావానికి లోబడి వుంటుంది. కామ క్రోధాది గుణాలను జయించటం చాల కష్టం. ఒక వస్తువును చూడగానే దానియందు ఆసక్తి లేక ప్రేమ కల్గుతుంది. దానినే మోహము అంటారు. ఆ వస్తువుని పొందాలనేకోర్కె జనిస్తుంది. అది కామ సంకల్పము. మనస్సు సంకల్పించిన దానిని పొందితే మోదము. పొందకుంటే దుఃఖము కల్గి దాని ద్వారా కల్గే క్రోధము పతనానికి దారితీస్తుంది. అనుకున్నది జరిగితే మనస్సు పొంగి పోతుంది. అనుకున్నది జరగకపోతే క్రుంగిపోతుంది.

కోర్కెలకు అంతు ఉంటుందా? ఏరకమైన సంకల్పములు గాని కోర్కెలు గాని లేని మహాత్ముడు యోగి. అలాకాకుండా తన సంకల్పాలను కోర్కెలను తన సౌఖ్యానికి కాకుండా ఇతరుల సౌఖ్యానికి త్యాగం చేసే త్యాగినే భక్తుడు లేక సాధకుడు అంటారు. అటువంటి సాధకుడే సద్గురుమూర్తిని సేవించగల అధికారి. కామ, క్రోధాది గుణాలన్నింటిని జయించగల్గినా మాత్సర్యాన్ని జయించటం చాల కష్టం. మాత్సర్యం అంటే ఈర్ష్య, అసూయ, అసహనము, ఓర్వలేని తనము. మాత్సర్యము అనేది జన్మాంతరవాసన. అది మార్బుల్ మీద నాచులాగా మనస్సుని ఆవరించి ఉండే సంస్కారహీనత. అది సాధకుడిని పడవేస్తుంది. ఇక్కడ మీకొక ఉదంతం చెపుతాను.

ఒక గృహస్థుడు తన ప్రయాణ సౌకర్యం కోసం ఒక బండిని తయారు చేయించుకున్నాడు. పట్నం వెళ్ళి సంతలో ఒక ఎద్దుని కొనుక్కొని తెచ్చుకున్నాడు. కుటుంబ సభ్యులతో పట్నానికి వెళ్ళటానికి సౌకర్యంగా వుంటుంది కదా అని ఎద్దుబండిని ఏర్పరచుకున్నాడు.

ఒకనాడు తన స్వంత ఎద్దుబండిలో పట్నానికి బయలుదేరాడు. పట్నానికి చేరేంతవరకు ప్రయాణం బాగానే సాగింది. పట్నం చేరగానే ఎద్దు ఆగిపోవటం మొదలు పెట్టింది. తర్వాత విషయం అర్థమైంది.

ఆ ఎద్దుని మునిసిపాలిటీవారు చెత్తను తోలటానికి ఉపయోగించే బండికి కట్టేవారని ఎక్కడ రోడ్డుమీద చెత్త కనబడితే అక్కడ ఆగిపోయేది. అదే వాసన అంటే. వాసన అంటే అలవాటు అన్నమాట.

చూశారా! మానవుడు కూడా తన సంస్కార హీనతను జయించటం చాల కష్టం. దానిని జయించాలంటే గురుకృప అవస్యము అన్నారు" శ్రీ బాబూజీ మహరాజ్.



# అమ్మమాట
# 'అవగాహన చేసుకో'

-జపమాలా ప్రసాద

శ్రీగురుదేవులు మహాసమాధి ప్రవేశం చేసిన బహుళదశమిని మనం ప్రతినెలా 'శ్రీగురుదశమి' అని వ్యవహరించుకుంటూ, ఆ రోజు సత్సంగ కార్యక్రమాన్ని నిర్వహించుకుని, సద్గురుపాద పూజ చేసుకుని రక్షను పొందుతున్నాము. మనకి జన్మజన్మల నుండి వస్తున్న కర్మయొక్క దశ మార్చటానికేనేమో మనకీ 'శ్రీగురుదశమి' నిచ్చారు శ్రీగురుదేవులు!




మన దశ ఎప్పుడూ హాయిగా, శాంతిగా ఉండాలి. ఆ శాంతి మనలోనే, మనతోనే ఉంది. పరమాత్మ ఏ విధంగా అవ్యక్తమై ఉన్నాడో, మనలోనే ఉన్న శాంతికూడా అవ్యక్తంగానే ఉంది. మనలో ప్రాపంచిక విషయాలు చేరి, ఆ 'శాంతిని' గుర్తించ నీయటం లేదు. అందుకనే గురుదేవులెప్పుడూ "శాంతము లేక - సౌఖ్యము లేనే లేదు" అని పాడేవారు. అంతేకాదు, ఆ శాంతిని పొందే మార్గం కూడా శ్రీస్వామివారే సూచించారు -

"శాంతాకారం । భుజగ శయనం। పద్మనాభం । సురేశం । విశ్వాధారం। గగన సదృశమ్। మేఘవర్ణం। శుభాంగమ్। లక్ష్మీకాంతమ్। కమలనయనం। యోగి హృద్ధ్యాన గమ్యమ్। వందే విష్ణుమ్। భవభయ హరమ్। సర్వలోకైక నాధమ్ ।"

శాంతి కావాలనుకునేవారు శాంతాకారుడైన భగవంతుని ధ్యానిస్తే చాలు. శాంతం పొందాలనుకునేవారు వాళ్ళు శాంతిగా ఉండాలి. తన దోషాలను తాను గుర్తించినవాడే శాంతంగా ఉండగలుగుతాడు. తన దోషాలను తాను గుర్తించి ఏడుస్తూ కూర్చోకూడదు. దోషాలను గుర్తించి వాటిని తొలగించుకోవడానికి గట్టిగా ప్రయత్నం చేయాలి.

ప్రపంచ విషయాల యందు ఆరాటం పెరిగే కొలదీ ఆ రాటకి మన త్రాడు ముడిపడిపోతుంది. అందుకనే ప్రపంచ ధ్యాస తగ్గించుకుని, పరమాత్మ ధ్యాస పెంచుకోమని మహాత్ములు హెచ్చరిస్తున్నారు.

పిల్లలు తినకపోతే తల్లి ఎంతో ప్రేమతో కూడిన ఆవేదనతో పిల్లవాడి నోటిలో ఆహారం కుక్కుతుంది. ఏదో ఒక విధంగా ఆహారం కడుపులోకి వెళితే వాడికి బలం చేకూరుతుందని ఆ అమ్మ ఆశ. కానీ ఆ పిల్లవాడు తినకుండా ఉమ్మివేస్తాడు. తల్లి విసుక్కుంటుంది. ఒక దెబ్బ కూడా వేస్తుంది. తాను బలహీనురాలైతే తానే ఏడుస్తుంది! ఆ తల్లి బాధను ఎవరు వర్ణించగలరు? శ్రీగురుదేవులు అదేవిధంగా, భగవద్విషయాన్ని యింకా యింకా నోట్లో కుక్కుతున్నారు. నోట్లో కుక్కుతున్నారనే దానికంటే, భగవతత్త్వాన్ని మనలోకి ప్రవేశపెడుతున్నారు. అయినా కూడా దానిని లోపలికి వెళ్ళనీయకుండా చేస్తున్న ప్రబుద్ధుల నేమనాలి? "అయ్యో! నా ప్రవర్తనలో ఎన్ని తప్పులు చేశానో! శ్రీ గురుదేవులు ఎన్నెన్ని సువర్ణావకాశాలను యిచ్చారో! అవన్నీ వ్యర్థం చేసుకున్నానే" అని ఏడ్చే రోజు వస్తుంది. అలాగే ఒట్టి చేతులతో వెళ్ళిపోతాం!

మన జీవితంలో, మన సాధనలో అనేకమైన అవరోధాలు వస్తూ ఉంటాయి. వాటిని తాత్కాలికంగా ప్రక్కకి నెట్టేయకూడదు. అలా చేస్తే, అవి అక్కడే ఉండి ఎదురు చూస్తాయి! వాటిని జాగ్రత్తగా పరిశీలించి, విచారణ చేసి, అవగాహన చేసుకోవాలి. అప్పుడవి శాశ్వతంగా మనల్ని విడిచి వెళ్ళిపోతాయి. ఇక్కడకి వచ్చి కూర్చునేసరికి మనకంటే ముందే విషయాలన్నీ వచ్చి మన సాధన మార్గానికి అడ్డుగా నిలుస్తాయి. మనం కొననక్కర్లేకుండానే జన్మజన్మాంతరాల నుంచి యీ వాసనలు సంక్రమించాయి. వాటిని విచారణ చేయండి. అవగాహనకి తెచ్చుకోండి. "ఎందుకిది వద్దన్నారు? అయినా కూడా చేయవద్దన్నది నేను చేస్తున్నాను ఎందుకు?" అనే విచారణ చేస్తే, దాని గురించి మీకే అర్థం అవుతుంది. మహాత్ముల దగ్గరకి వెళ్ళి "నాకు ఆత్మ తత్త్వాన్ని బోధించండి" అని ఎంత మంది అడుగుతారు?

"వస్తా వట్టిది - పోతా వట్టిది - ఆశ ఎందుకంట?"

"దారీ తెన్నూ తెలియని ఈ సంసారము సాగరమేరా! ఎవరికి వారే యమునాతీరే, చివరికి వంటరివేరా!" ఇలా ఎన్నెన్ని తత్త్వాలు చెప్పారో! "మాతా నాస్తి - పితా నాస్తి; నాస్తిబంధు సహోదరః ; అర్థం నాస్తి - గృహం నాస్తి తస్మాత్ జాగ్రత! జాగ్రత! - ఇలా చెప్పారని భార్యా బిడ్డలను, యిల్లూ వాకిళ్ళను వదిలివేయమని కాదు. అలా వదిలేస్తే అది పిరికితనం

అనిపించుకుంటుంది. అందరికీ ధర్మంగా ప్రేమను అందించు. మమకారం చెందకు. చెప్పిన దానిని గురించి ఆలోచించండి. అవగాహన చేయండి.

ప్రతిరోజూ నీవు వీటన్నిటిని వదిలివేస్తున్నావు. ఎప్పుడు? రాత్రి నిద్రలో! నువ్వు నిద్రపోయినప్పుడు నీ యిల్లు ఉందోలేదో కూడా నీకు తెలవదు. ప్రక్కనే పడుకున్న దారాపుత్రాదులను కూడా మరచిపోతావు! వాళ్ళ వరకూ ఎందుకు? అసలు నీ ఉనికినే నీవు మర్చిపోతున్నావు! అన్నింటినీ వదిలిపెట్టేశావు కనుకనే 'నేను హాయిగా నిద్రపోయాను' అంటున్నావు. మహాత్ములు, జాగ్రదావస్థలోనే ఆ స్థితిని పొంది జాగృతిని పొందమంటున్నారు. అందుకే మనకి మానవజన్మనిచ్చి యింత గొప్ప అవకాశం కల్పించాడు దేవుడు. తాత్కాలిక వైరాగ్యాలు వద్దు. అసలైన వైరాగ్యాన్ని తెలియజేసేది, గుర్తింపజేసేది మహాత్ముల వాక్కు. ఎవరిలో సత్యాసత్యవివేకం ఆరూఢమై ఉంటుందో, అట్టి ప్రతివాడూ ఒక వివేకానందుడే అయిపోతాడు.

నీలోనే ఉన్న శాంతిని గుర్తించు. అనవసర విషయాలకి నీ మనసులో చోటివ్వకు. ఒకవేళ అవి నీలో ప్రవేశిస్తే వెంటనే తొలగించుకో. అవగాహన పెంచుకో! అట్టి సాధనకు కావలసిన అఖండ భక్తి, జ్ఞాన, వైరాగ్యములను, అఖండ సాధన సంపదని ప్రసాదించి గురుపాదుకలు సర్వదా కాపాడుగాక! సుఖీభవ! సుఖీభవ!!



ఓ కృష్ణా! నీవు లోకములకెల్ల ప్రభువైననూ చేతిలో వెన్న ముద్దయు, సిగలో నెమలి పింఛమును, ముక్కున ఆణి ముత్యమును ధరించి పసి బాలునివలె ఉంటివి గదా!

– శ్రీకృష్ణ శతకము

# మహా శివరాత్రి

- పరాశర ప్రసాద్

మాఘమాసం బహుళ చతుర్దశి భారతీయ సంస్కృతీ సాంప్రదాయంలో అత్యంత పవిత్ర పుణ్యదినం మహాశివరాత్రి. శ్రీపార్వతీ పరమేశ్వరులకు అత్యంత ప్రీతికరమైన యీ పర్వదినాన భక్తులంతా అభిషేకాలు, పూజలు, ఉపవాసాలు, జాగరణ, శివారాధనలలో గడుపుతారు.



భక్తులంతా పార్వతీ పరమేశ్వరులను అరాధించుకోవటానికి అవకాశం కల్పించినట్లుగా మాఘ బహుళచతుర్దశినాడు సృష్టి, స్థితి, కర్తలయిన బ్రహ్మ విష్ణువుల మధ్య సృష్టి కార్యం గొప్పదా? పోషణ భారం వహించటం గొప్పదా? అన్న విషయం మీద వాదులాట జరిగింది.



ఆ సమయంలో ఓంకార నాదం ధ్వనిస్తూ వారి ఎదురుగా ఒక అగ్ని జ్వాలా స్థంభము ఆవిర్భవించింది. దానిని చూసి యిరువురు ఆశ్చర్యపోయారు. వెంటనే బ్రహ్మ, విష్ణువు యిద్దరు కలసి 'ఈ స్థంభం తుది, మొదలు ఎవరు తెలుసుకో గలుగుతారో వారే అధికులు' అని ఒక నిర్ణయానికి వద్దాం అని నిశ్చయించుకుని హంస రూపం దాల్చి, బ్రహ్మ పైకి; వరాహ రూపం దాల్చి విష్ణువు క్రిందికి ప్రయాణమై వెళ్ళారు.

తన ప్రయ.త్నంలో విఫలుడైన విష్ణుమూర్తి యధాస్థానికి వచ్చి బ్రహ్మకోసం నిరీక్షించారు. బ్రహ్మ కూడా విఫలుడై వెను తిరిగి వస్తుంటే పై నుంచి క్రిందికి వస్తున్న మొగలి పువ్వు కనిపించింది. వెంటనే ఆ పువ్వును నువ్వు ఎక్కడనుంచి వస్తున్నావు? అని ప్రశ్నించాడు. మొగలి పువ్వు సమాధానం చెబుతూ ఈ స్థంభం పై భాగం నుంచి జారిపడి క్రిందికి వస్తున్నానని సమాధానం



చెబుతుంది.

బ్రహ్మ మొగలి పువ్వును తాను విష్ణుమూర్తికి చెప్పే మాటకు సాక్షిగా ఉండమని కోరటం, మొగలిపువ్వు అంగీకరించటం జరిగింది. బ్రహ్మగారు యథాస్థానానికి చేరి విష్ణుమూర్తితో తాను స్థంభం యొక్క అగ్ర భాగాన్ని చూశానని అందుకు ఈ మొగలిపువ్వు సాక్ష్యమని చెప్పి నమ్మించాడు.

ఇంతలో అనుకోకుండా అగ్ని స్థంభం నుండి పరమేశ్వరుడు సాక్షాత్కరించి అసత్యమాడిన బ్రహ్మ శిరస్సుని తన ఖడ్గంతో ఖండిస్తాడు. అందువలననే బ్రహ్మ చతుర్ముఖుడయ్యాడు. బ్రహ్మకు సాక్షిగా నిల్చిన మొగలి పూవ్వును ఏ రకమైన పూజకు పనికిరాదని శాపమిచ్చాడు. బ్రహ్మ , విష్ణులిరువురు పరమేశ్వరుని విశిష్ఠతను తెలియజేసిన పర్వదినమే 'మహాశివరాత్రి'గా పరిగణింప బడుతోంది.



"నా విభూతులకు లేదు అంతం !
లేదు కదా నాకు ఆదిమధ్యాంతం!
ఐశ్వర్యం, కాంతి, శక్తి -
ఏ వస్తువులలో ఉన్నా తత్కారణం నా యోగ శక్తి!"
తరువాత
విశ్వరూప దర్శన భాగ్యం అనుగ్రహించాడు.
తన బావ మహాత్మ్యం గ్రహించాడు విజయుడు
అతనికి
విరాడ్రూపం సంభ్రమాశ్చర్యాలు కలిగించాయి.
కోటి సుర్యప్రకాశం గాంచి కళ్ళు చెమ్మగిల్లాయి.
సాష్టాంగ ప్రణామాలర్పించాడు,
వేడుకొన్నాడు
తనను క్షమించమని,
తనను రక్షించమని.

-పసుమర్తి బద్రీనాథ్

# సన్నిధిలో సంభాషణ

- పరాశర ప్రసాద్

13-12-.85

'గురువుగారే నయం బాబుగారికన్నా. వారానికో పదిరోజులకో ఒకసారి భగవత్తత్వాన్ని గురించి విచారణ చేయమంటున్నారు' అని మీరు అనుకోవచ్చు. వారానికి సరిపోయినంత ఆహారాన్ని ఒక్కసారే స్వీకరించ గలుగుతారా మీరు? అను దినము మీరు క్షుద్బాధని తీర్చుకుంటారే?" అని ప్రశ్నించారు శ్రీ బాబు.



శ్రీబాబు ఇంకా మాట్లాడుతూ "అంత్యకాలంలో భగవన్నామస్మరణ చేసినపుడే జన్మరాహిత్యాన్ని పొందగలుగుతారు అని శ్రీకృష్ణభగవానుడు భగవద్గీతలో సెలవిచ్చారు కదా! పోనీ అంత్యకాలం ఎప్పుడో ఎవరైనా చెప్పగలుగుతారా! అందువలననే శ్రీ శంకర భగవత్పాదుల వారు 'భజగోవిందం భజగోవిందం' అని సెలవిచ్చారు. అనుక్షణం గోవిందుని భజించాలి 'గోవిందా!' అని అంటే గోవిందుణ్ణి నీ హృదయమునందు విందుకి ఆహ్వానించి నీలోని కామ, క్రోధ, లోభ, మోహ, మద మాత్సర్యాలను, సత్త్వరజస్తమోగుణాలను ఆయనకు అర్పించి విందు ఆరగించమంటున్నావు అన్నమాట. దాని వలన గోవిందుడు నీ హృదయాన్ని కలుష రహితం చేస్తాడు. అది ఆయనకు చాలా ఇష్టము. ఎంతో ప్రియమైనది.

శాస్త్రజ్ఞానము, శబ్దజ్ఞానము మానవుడిని తరింపచేయలేవు. శాస్త్ర వాసన ఉన్నంత వరకు ఎటువంటి అనుభవాన్నీ పొందలేరు. శబ్దార్థము లేక వాచ్యార్థము అనేది శాస్త్రవాసన. అది సామాన్య మానవుడి స్థితి. లక్ష్యార్థము సాధించిన వాడిది మనస్సు దాటిపోయిన స్థితి. ఆ స్థితిలో అందరిలో మంచినే చూస్తాడు. అందరిని ప్రేమించగలుగుతాడు. అందరిలోనూ ప్రేమ స్వరూపాన్నే చూడగలుగుతాడు. ఆ స్థితిలో ఇంద్రియాలన్నీ మనోలయమై ఉంటాయి. మనోలయమైనపుడు

బాహ్యదృష్టి ఉండదు. అక్కడ స్త్రీ పురుష లింగ భేదము ఉండదు. లక్ష్యార్థము సాధించిన వాడి హృదయంలో ఆ పరమాత్ముడు నిలిచి ఉంటాడు.

రావణ సంహారము అనంతరము శ్రీరామచంద్రుడు యుద్ధములో సహాయము చేసిన వారందరికి బహుమతులను అందజేశాడు కాని హనుమంతుడు మాత్రం శ్రీరామచంద్రుని ఆలింగనము మినహా మరి ఏ ఇతరమైన దానిని కోరుకోలేదు. రామనామము మినహా మరి ఏ ఇతరమైనది ఆయనకు రుచికరించలేదు.

ఆ స్థితిని పొందవలెనంటే సజ్జన సాంగత్యము చేయాలి. సజ్జన సాంగత్యము అంటే సజ్జనులతో సంచరించటం అని కాదు. మానవులలో మంచివారెవరో చెడువారెవరో ఎలా తెలుసుకో గలుగుతారు? అలా తెలుసుకోగలిగిన స్థితిలో ఉన్నవారికి అంతటా మంచి మాత్రమే గోచరిస్తుంది.

అందువలన సజ్జన సాంగత్యము అంటే మీ ఇంద్రియాలను అదుపులో ఉంచుకొని, మీ మనస్సు, ఇంద్రియాల సాంగత్యము మంచిదై ఉండేటట్లు చూసుకోవాలి. అప్పుడు మనోలయమవుతుంది. దీనిని సాధించాలంటే నిరంతర భగవన్నామస్మరణ చేయాలి. అది నీకు ఎలా రక్షణ చేస్తుందో ఒక సంఘటన చెప్తాను.

నేను ఒకసారి విశాఖపట్నం వెళ్లినపుడు రైల్వేగేటు దాటవలసి వచ్చింది. అక్కడ ట్రాఫిక్ జామ్ అయింది. ఇంతలో ఆకాశంలో గ్రద్ద ఒక పామును తీసుకువెళ్తుంటే అది జారి ఒక సైకిల్ మీద వెళ్తున్న ఇద్దరు వ్యక్తులలో ఒకరి మీద పడింది. పాము ఆ వ్యక్తిని కరిచింది. ఆ వ్యక్తి మరణించాడు. అదే అకాల మృత్యువు అంటే. దీని నుంచి రక్షణ పొందాలంటే భగవన్నామ స్మరణ చేయాలి అని మీ హృదయబాబు హెచ్చరిస్తున్నాడు" అన్నారు.

# యోగవాశిష్ఠము

(గత సంచిక తరువాయి) -సుషుమ్న ప్రసాద

వారి గృహాల్లో, మూడు కుండలున్నవి. ఇలా యెత్తేటప్పటకి మొదటి రెండు కుండలు ముక్కలు ముక్కలై పోయాయి. మూడవ కుండను తాకినవెంటనే మట్టిగా మారింది. వారా కుండల్లో ఎనిమిది శేర్ల బియ్యంలో నుండి, పన్నెండు శేర్ల బియ్యము తీసివేస్తే యెంత మిగులుతుందో, ఆ బియ్యంతో నీరు, నిప్పు ప్రమేయం లేకుండా చక్కగా వంట చేశారు. వారు ఆ ఆహారాన్ని నోరు, నాలుక, దంతములేని అనేక మంది బ్రాహ్మణులకు వడ్డించారు. మిగిలిన ఆహారాన్ని చక్కగా నేతితో కలిపి ఆ ముప్వురు రాకుమారులు భుజించారు. తరువాత సాయంకాల సమయములో వారు వేటకు వెళ్ళి యెంతో వినోదంగా సమయం గడిపారు".



తల్లి ఆ కధను ముగించగానే, ఆ బాలుడు ఆ కధవిని యెంతో ఆనందించాడు. అతనా కధను వాస్తవంగా నమ్మాడు. అదే విధంగా వివేచనాశక్తి, ఆత్మవిచారణలేని, అజ్ఞానులైన ప్రజలు, యీ ప్రపంచమును సత్యంగా భావిస్తారు. గాలితో నిర్మితమైన భవనంలాంటి యీప్రపంచాన్ని పసివాడు తన తల్లి చెప్పిన ఊహాజనితమైన కధను యెలా సత్యమని నమ్మాడో అలాగే అజ్ఞానులైన మానవులు యీజగత్తును వాస్తవమని భావిస్తారు. తల్లి శూన్యాని ఎలా రూప కల్పన, నామకల్పన చేసిందో, అలాగే మనసు యీ అసత్యమైన ప్రపంచములో, మాయా జనితమైన వస్తువులకు నామకల్పన, రూపకల్పన చేస్తుంది.

ఈ విశ్వమంతా సంకల్పము యొక్క స్వభావము తప్ప మరొకటి కాదు. ఈవిశ్వమంతా మనసు చేత సృష్టింప బడ్డది. ఊహా జనితమైన కల్పనే తప్ప ప్రత్యేకమైన ఉనికి లేదు. ఊహ అన్ని వస్తువులకు చిత్రమైన రూప కల్పన చేస్తుంది. స్వర్గము, భూమి, ఆకాశము, గాలి, నదులు, పర్వతములు మున్నగువన్నీ సంకల్పము లేక ఊహ చేత సృజింప బడ్డవే. మనస్సు యొక్క విస్తరణే సంకల్పము. సంకల్పము తన వైవిధ్యమైన సృజనాత్మక శక్తిచేత జగత్తును సృష్టిస్తుంది. ఈ విశ్వమంతా సంకల్ప శక్తి చేత రూపకల్పన చేయబడ్డది. మనసు యొక్క క్రియాత్మకమైన శక్తియే సంకల్పము. కనుక "ఓరామా!

సంకల్పములన్నిటినీ నిర్మూలముచేసి, వివిధ మార్పులతో కూడిన మనసు లేక సంకల్పాల కతీతమైన నిర్వికల్ప స్థితిని చేరుకో ".

" ఓరామా! అజ్ఞానులైన వారు, తమ అవాస్తవమైన ఊహ వలన తప్పులు చేస్తుంటారు. వారీ మాయాజనితమైన జగత్తును సత్యముగా భావిస్తారు. నశించే లక్షణాలను నాశరహితమైన ఆత్మకాపాదిస్తారు. వారి మనసులు సంకల్పాలతో, ఆలోచనలతో నిరంతరమూ చలిస్తుంటాయి. దేహమే తామని వారు భావిస్తారు. కాని మహాత్ములు తప్పుడు ఊహలు, తప్పిదాలకు, దూరంగా వుంటారు. వారికి ప్రపంచమొక ఎండ మావిలాంటిది. వారెప్పుడూ తాము దేహం కాదని, అమృతమైన ఆత్మయనే ధృడ నిశ్చయంతో ఉంటారు.

కనుక ఓరామా! ఈ ప్రపంచము నిత్యమనే తప్పుడభిప్రాయాన్ని విసర్జించు. అసత్యము, అనిత్యమైన దానికి వీడ్కోలు చెప్పాలి. నిత్యము, సత్యము సర్వ వ్యాపకమైన బ్రహ్మ మొక్కటే ఉన్నది. అది అన్నిటికి ఆధారము. బ్రహ్మమొక్కటే వాస్తవమైనది. జీవుడెక్కడ? మనసెక్కడ? బంధమెక్కడ? ముక్తి యెక్కడ? ఎవరు బంధింపబడ్డారు? ఎవరు ముక్తిని పొందుతున్నారు? బంధము, స్వేచ్ఛ యనేవి మనసు యొక్క కల్పితమైన ఊహ మాత్రమే.

నశించే శరీరము, నిత్యమైన ఆత్మకున్న అనుబంధము. ఘటము, ఆకాశమునకున్న సంబంధము లాంటిది. అవాస్తవమైన ప్రపంచము వాస్తవముగా గోచరిస్తుంది. ఈ విశ్వము యొక్క ఊహా జనితమైన కాలపరిమితి, నిద్రలోని సుదీర్ఘ స్వప్నములాంటిది. ఈ ప్రపంచము సుదీర్ఘమైన కలలాంటిది. ఈజగత్తు ఒక పెద్దఅరణ్యము. అది వ్యాధి, మరణమనే సర్పాలతో నిండి ఉన్నది. మనసు యీ అరణ్యమునకధిపతి. ఈ మనసు మానవుల ననేక గోతుల్లోకి, కష్టాల్లోకి తరిమి కొడ్తున్నది. ప్రపంచము యొక్క ఆ లోచన లేక ఊహ ఉనికికి కారణము. ఓ రామా! విచారణహేతువు, వివేచనాశక్తి ద్వారా ప్రపంచమును మనసు నుండి నిర్మూలం చేయి. మనసు తనలో వుత్పన్నమయ్యే కోరికల అలజడి ద్వారా బాధ, మృత్యువులో యిముడిస్తుంది.

"మనసును విచ్చలవిడిగా, విహరించనీయ వద్దు. దాన్ని నిర్దాక్షిణ్యంగా తృంచి వేయి. అదుపులో పెట్టు. నిర్మూలం చేయి. అప్పుడు నీవు సత్యాన్ని గ్రహించి, సంపూర్ణమైన స్వేచ్ఛ లేక మోక్షమును పొందుతావు. అప్పుడు అన్ని బాధలు, దుఃఖాలు, మోసాలు, అంతమౌతాయి" యని వశిష్ఠ మహర్షి ప్రబోధించారు.

-సశేషం

# శ్రీ కాళీ గార్డెన్స్ కార్యక్రమాలు

**మార్చి 2014**

3 సోమ : శ్రీలలితానందసరస్వతీస్వామిని ఆరాధన.

5 బుధ నుండి 12 బుధ వరకు : నిడమర్రు గ్రామంలో సత్సంగ సమావేశాలు.

16 ఆది : పూర్ణిమ హెూలీ. శ్రీసద్గురుపాదపూజ

26 బుధ : శ్రీగురుదశమి సత్సంగ సమావేశము, శ్రీసద్గురు పాదపూజ

29 శని : మాసశివరాత్రి

30 ఆది : అమావాస్య

31 సోమ : శ్రీ జయ నామ సంవత్సర ఉగాది. ఉదయం 11 గం.లకు పంచాంగ శ్రవణం. శ్రీసద్గురు పాదపూజ, భక్త సమారాధన

ఏప్రిల్ 2014

1 మంగళవారం నుంచి 7 సోమవారం వరకు : మౌన ధ్యాన సప్తాహ శిబిరం.

8 మంగళ శ్రీ రామనవమి, ఉదయం గం.5.30లకు శ్రీ సద్గురు పాదపూజ, 11గం.లకు సామూహిక శ్రీ సీతారామ కళ్యాణములు, భక్త సమారాధన.

15 మంగళ : పూర్ణిమ - శ్రీ సద్గురు పాద పూజ.

24 గురువారం : శ్రీగురుదశమి, సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ

27 ఆది : మాస శివ రాత్రి.

29 మంగళ : అమావాస్య

# గురుసేవ

-ఓం కాళి

ఒక యజమాని కొడుకు అల్లరి చిల్లరగా తిరుగుతూ ఉంటాడు. వాళ్ళింటికి ఒక గురువుగారు వస్తారు. ఆ అల్లరి కొడుకు సంగతి చెప్పి యజమాని "స్వామీ! వీడు బాగుపడే మార్గం మీరే చూపాలి అని గురువుగారిని ప్రాధేయపడతాడు.

ఆ గురువుగారు నెమ్మదిగా ఆ అల్లరి పిల్లవాడ్ని మచ్చిక చేసుకొని "నాయనా! నీవు కనిపించిన పెద్దవారందిరికి నమస్కారం పెడుతూ వుండాలి" అని చెప్తారు. ఆ అల్లరి పిల్లవాడు "స్వామీ అందరికీ అయితే పెట్టను. అందరి బదులు మీకు పెడతాను" అంటాడు. గురువుగారు "సరే" అన్నారు.

ఈ అల్లరి వాడికి ఇంక కొంత మంది పిల్లలు కూడా కలిశారు. ఇక గురువుగారు బైటకు పనిమీద వెళ్ళేటప్పుడూ, తిరిగి వచ్చేటప్పుడూ, నమస్కారం పెడ్తూ ఉన్నారు. ఒక సారి గురువుగారు బావివద్దకు స్నానం చేయటానికి వెళ్ళి పిట్టగోడ చిన్నగా వుండటంతో బావిలో పడటం జరిగింది. గురువుగారు శిష్యులందరిని పిలుస్తున్నారు. అందరూ వచ్చిచూసారు.

ఒక బుట్టకు తాళ్ళుకట్టి లోపలకు దింపారు. గురువుగారు బుట్టలో కూర్చున్నారు.శిష్యులు తాళ్ళతో పైకిలాగారు. గురువుగారు పైకివస్తూ కనిపించగానే శిష్యులకు గురువుగారికి నమస్కారం చేయాలని గుర్తుకువచ్చి అందరూకలసి గురువుగారికి నమస్కారం చేస్తారు.ఆ నమస్కారం పెట్టటంలో బుట్టతాళ్ళు వదిలేస్తారు. మరల గురువుగారు బావిలో పడిపోతారు.

సారాంశం -

శ్రీ గురుదేవుల దగ్గర సంచరించేటప్పుడు సమయాసమయాలును అనుసరించి మనం చేసే సేవలు నమస్కారాలు వగైరా ఆచరించాలే కాని గురువుగారికి నమస్కారం పెట్టాలి కదా అని గురువుగారు నడుస్తూ వెళ్తూవుంటే మనం అడ్డు పడితే వారు బొక్కబోర్ల పడవచ్చు.

గీతావాక్యం -

తద్విద్ధి ప్రణిపాతేన పరిప్రశ్నేన సేవయా ।
ఉపదేక్ష్యన్తి తే జ్ఞానం జ్ఞానిన స్తత్త్వ దర్శినః ॥

# పరి ప్రశ్నేన సేవయా

- పరాశర ప్రసాద్

సద్గురుదేవులు సద్గోష్ఠిలో భక్తులను ప్రశ్నిస్తూ "సాధన ఎందుకు? ఆత్మ తత్త్వాన్ని తెలుసుకోవటానికే కదా!" అని ప్రశ్నించారు. భక్తులంతా ఆలోచనలో పడ్డారు. సాధన చేసేది ఆత్మజ్ఞానం కొరకే కదా! మరి యీ ప్రశ్నకి సమాధానం ఏమని చెప్పాలి అని ఆలోచించుకునే లోపే శ్రీబాబు మాట్లాడుతూ "ఆత్మజ్ఞానం ప్రాప్తించేది కాదు. అది కొత్తగా పొందబడినది కాదు. ఇదివరకు లేనిదైతే దానిని పొందాము అని మనం చెప్పుకోవచ్చు. ఏమిటయ్యా అలా ఆలోచిస్తున్నారు? చీకటి గదిలో ఒక వస్తువు ఉన్నది. ఆ వస్తువు గోచరించటం లేదు. ఒక దీపం తీసుకువచ్చావు. ఆ వస్తువు వెంటనే కనబడింది. ఆ వస్తువు అంతకు పూర్వము అక్కడే ఉంది. దీపం తీసుకు వచ్చినంత మాత్రాన ఆ వస్తువు అక్కడికి రాలేదు కదా. అయితే దీపం చీకటిని తొలగించటం ద్వారా వస్తు దర్శనం అయింది.



అలాగే ఆత్మజ్ఞానం పొందటానికి మనస్సుని ఆవరించిన సంకల్పవికల్పములే అవరోధంగా గ్రహించాలి. ఆత్మవస్తువు సర్వవ్యాపకమైనది. నిత్య సత్యమైనది. అయినా ఎందువల్ల కనబడటం లేదు అనే సందేహం కలగవచ్చు.

వెంకయ్య అనే వ్యక్తి మీ యింటి పరిసరాలలోనే సంచరిస్తున్నాడు. కాని ఆ వ్యక్తితో పరిచయం లేనంతవరకు ఆ వ్యక్తిని గుర్తించలేరు కదా. అలాగే ఆత్మవస్తువుతో అనుక్షణం రమ్యత చెందుతున్నా దానిని గుర్తించ లేకపోతున్నారు.ఆత్మదర్శనం పొందటానికి ఏమాత్రం కష్టపడనక్కర్లేదు. ఒక్క క్షణకాలం నీ మనస్సుని బాహ్య శబ్ద, స్పర్శ, రూప, రస, గంధాలకు దూరంగా అంతర్ముఖం చేసి చూడు. వెంటనే 'నేనున్నాను' అనే భావన కలుగుతుంది.

అక్కడ నేను సాధన చేస్తున్నాను, ప్రయత్నం చేస్తున్నాను అనేది కూడా మరచి దేహము యింద్రియాల్ని మరచి ' ఉన్నాను' అనే భావన, 'ఉనికి'ని వీక్షించు. నీవే మిగులుతావు. ఆ స్థితిని పొందినవాడికి మరణ భయం ఎక్కడది? సినిమా తెర మీద పులిని చూసిన వాడు ఎన్నడూ భయపడడే? మనో వ్యాపారాలను తొలగించుకుంటే మనస్సు నిర్వికల్పం అవుతుంది. అద్దానికి ఎదురుగా ఏ వస్తువు లేకుండా చేసుకుంటే అద్దం అప్రయత్నంగానే శుభ్రంగా ఉంటుంది." అన్నారు సద్గురుదేవులు.

# వందనాలు... వందనాలు

-పెనుమాక నాగేశ్వర రావు

వందనాలు వందనాలు సద్గురుమూర్తికి వందనాలు
శిరసు వంచి మనసు ఉంచి చేస్తున్నాము వందనాలు ॥వం॥

కరుణామూర్తులైన కాళిబాబుకు
మధుర మూర్తులైన మా హృదయబాబుకు వందనాలు ॥వం॥

అమృత రూపునకు, ఆనంద నిలయునకు
కాళికా ప్రియనందనునకు వందనాలు ॥వం॥

కర్మయోగులైన కాళిబాబుకు
మారుతి సన్నిభులైన మా హృదయబాబుకు వందనాలు ॥వం॥

శిరసు వంచి మనసు వుంచి చేస్తున్నాము వందనాలు
అభివందనాలు....... అభివందనాలు..... ॥వం॥



# శ్రీకృష్ణ కర్ణామృతము

గత సంచిక తరువాయి

– సుశీలా ప్రసాద

శ్లో॥ పిఞ్ఛావతంస రచనోచిత కేశపాశే
పీనస్తనీ నయిన పఙ్కజ పూజనీయే
చన్ద్రార విన్ద విజయోద్యత వక్త్ర బిమ్బే
చాపల్యమేతి నయనం తవ శైశవేనః

తా॥ ఓ కృష్ణా! నెమలిపురి దాల్చుట కనువైన కురులముడి గలది, యౌవనవతుల కన్ను దామరులచేత పూజింప బడినది, చంద్రుని కలువలను గెలువ బూనిన ముఖమండలము గలదియునగు నీ చిరుత ప్రాయము మా నేత్రముల నాకర్షించుచున్నది.



తమ వాకిట్లో పూసిన బొడ్డుమల్లెలు దండ గుచ్చి, ముద్ద మందారాలు గుత్తులుగా కట్టి అవి ఇవ్వాలన్న వంకతో యశోదమ్మ గారింటికి వెళ్ళింది గీత. అప్పుడు తను చూసిన చిన్న శిశువు అందాలు మనస్సు నిండా నింపుకుని వచ్చింది. ఇప్పుడీ సందెవేళ యమున ఒడ్డున ఇసుకలో తలకింద చేతులు పెట్టుకుని వెల్లకిలా పడుకుని ఆలోచిస్తోంది. మనస్సులో నిండిన ఆవిగ్రహాన్ని చూస్తోంది. నల్లని జుట్టులో తలమీద అలంకరించిన నెమలి పింఛం, జుట్టునిచూసి మేఘమనుకొని నెమలి పురి విప్పి ఆడినట్టు గాలికి కదులుతోంది సిగలో పెట్టిన బంగారు చంద్రవంక. మబ్బుల్లో దోబూచులాడుతున్న నెలవంకలా జుట్టులో దాగుతూ కనబడుతూ అందాలు వలికిస్తున్నది. కన్నయ్య అందాలు వాని వన్నె చిన్నెలు ప్రకృతి నిండా ప్రతిబింబిస్తూ మరింతగా కన్నయ్యని గుర్తుచేస్తోంది.

రెండు మూడు వాన చినుకులు మొహంమీద పడేసరికి గీత కళ్ళెత్తి ఆకాశం వంక చూసింది. చూస్తుండగానే వాన జడి పెద్దదైంది. ఇప్పుడు మళ్ళీ వంక దొరికింది. వెళ్ళి వెళ్ళి దగ్గిరలోనే ఉన్న నందన్న వాకిట్లోకి వెళ్ళింది. "లోపలికి రావే తడిసి పోతున్నావూ" అని లోపల్నించి చూసిన యశోదమ్మ రమ్మని కేక పెట్టింది. పిల్చిందే చాలు మహా భాగ్యమని లోపలికి వెళ్ళింది. అమ్మ చంకలో కూచుని వయ్యారాలు పోతూ కులుకుతున్న కన్నయ్య తనని

చూసి ముసి ముసిగా నవ్వాడు. కరువు తీరా చూద్దామంటే యశోదమ్మ ఏమనుకుంటోందో నని భయంతో చాటు మాటుగా చూస్తూ నిలబడింది గీత. వాన అంతకంతకి ఎక్కువై కుండపోతగా కురుస్తోంది. ఉండాలనే ఉన్నా పైకి మాత్రం ఎలాగో " ఇంటికి వెడతానే అమ్మా! " అంది. "నయం! ఇంత వానలో ఎక్కడో ఆ మూలగా ఉన్న యింటికి ఎలా వెడతావే! తొందరేమొచ్చింది ఉండు" అంది యశోదమ్మ ఆప్యాయంగా. యశోదమ్మ పురమాయించే పనులన్నీచేస్తూ కన్నయ్యని చూస్తూ చూస్తూ ఆనందపడి పోతోంది గీత. చీకటి కూడా బాగా పెరిగింది.

ఇల్లంతా దీపాలు వెలిగించమంది యశోదమ్మ. దీపాలు వెలిగిస్తుంటే కన్నయ్య ఒంటి కాంతుల ముందు అవి వెలవెల పోతున్నట్టు అనిపించింది గీతకి. "వీడికిన్ని నీళ్ళ పోసి బువ్వపెట్టి పడుకోబెడితే ఇక నిద్ర పోతాడు" అని యశోదమ్మ తన గారాల బిడ్డకి స్నానం చేయించి బట్టలు కట్టింది. ఇవన్నీ ఇంత దగ్గిరగా చూసే భాగ్యం దక్కినందుకు గీత మనస్సు ఆనందంతో గంతులు వేస్తోంది. యశోదమ్మ వెండి గిన్నెలో పెరుగన్నం కలిపి యిమ్మంటే ఇచ్చింది. పిల్లాడిని చంకలో పెట్టుకుని తల్లి గోరు ముద్దలు తినిపిస్తున్నంతలో....

వీధిలోంచి "నంద బాబయ్యా" అనే ఏడుపు గొంతు విన వచ్చింది. "దీపం తీసుకురావే" అంటూ నందుడు వాకిట్లోకి నడిచాడు ఆ పిలుపు విని, గీత దీపం తీసుకుని ముందు నడిచింది. "మా తమ్ముడు మీ పాలికాపు వేమగాడు బాబూ! పొలంనించి వస్తూ వానలో చీకట్లో కనబడక పక్కనున్న పంట కాలవలో పడిపోయాడండి. వాడివెనక పదడుగుల దూరంలో నేనూ మాబామ్మరిది వస్తున్నాం. మెరుపు వెలుగులో అది చూసి పరిగెత్తికెళ్ళి వాడిని గట్టుకి లాగామండి. ఇదుగో ప్రాణం వుందో లేదో తెలియట్లేదు బాబయ్యా సూడండి" వాడి అన్న ఏడుస్తూ చెప్తున్నాడు, నేలమీద పడుకోబెట్టినవాడిని చూపిస్తూ. " మందులిచ్చే మల్లన్నని పిల్చుకురండి!" అన్నాడు నందుడు.

ఎవరో పరుగెత్తారు. అంతే కాక అయోమయంగా ఉంది. తాటాకు గొడుగు వేసుకుని వచ్చాడు మల్లన్న, పొట్ట వత్తాడు. తెరచిన నోట్లోంచి మింగిన నీళ్ళు వస్తున్నాయి. చెయ్యి అందుకుని చూస్తూ "నాడి అందటం లేదు బాబూ!" అని పెదవివిరుస్తూ అన్నాడు మల్లన్న. వాడి అన్న గొల్లు మన్నాడు.

-సశేషం

(గత సంచిక తరువాయి)

# సర్వము నీ దయ

- సుశీలా ప్రసాద

"నిన్నటి రోజున ఐశ్వర్య మదోపేతుడనై అందరినీ చివరకి మృత్యువుని కూడా ఎదిరించి నిలవాలని తలపోశాను ఈ రోజు నాబలహీనతను సర్వ శూన్యతను కనుగొన్నాను. గర్వంతో విర్రవీగేందుకు ఈ క్షణాలలో నాకిక ఏ చిన్న అవకాశము లేదు. నా అజ్ఞానమంతా నా ఈ అనుభవాలతో నశించింది ప్రభూ ! నన్నీ గాఢ తమస్సులో నుంచి విముక్తిని చేసి వెలుగు బాట చూపు తండ్రీ!" శ్రీవర్ధనుని కల్మషాలన్నీ కన్నీటితో కరిగిపోయాయి. పశ్చాత్తాపాగ్నిలో మనస్సు పరిశుద్ధమై మేలిమి బంగారంలాగా జ్ఞాన తేజస్సులో ప్రకాశించ సాగింది. చల్లని హస్తస్పర్శ భుజానికి తగిలి శ్రీవర్ధనుడు కన్నీళ్ళు నిండిన కళ్ళతో వెనుదిరిగి చూశాడు. శాండిల్య రూపం ఎదుట కనబడింది. శ్రీవర్ధనుడు త్వరగా లేచి నిలిచాడు. "చక్రవర్తీ ! వర్ధన వంశ దీపకా ! ఇక్కడకు ఎలా వచ్చావు నాయనా? ఎందుకిలా విలపిస్తున్నావు వత్సా ?"

శ్రీవర్ధనుడా తపస్సంపన్నుని వాక్యాలకు బ్రహ్మానంద భరితుడయ్యాడు. "గురుదేవా ! నా అపరిమితమైన అహంకారం అణచటానికే దైవం నన్ను అధః పతితుణ్ణి చేసినాడు. నా సర్వస్వమూ లాక్కున్నాడు, నాకు మీ నుంచి గూడా రక్షణ రాలేదు. తమరు ముందుగా నువ్విక్కడికి ఏమి తీసుకు వచ్చావో చెప్పు" అని అడిగినప్పుడు నా గర్వమూ అహంకారమూ మీపాదాల చెంత సమర్పించ వచ్చాననీ అనలేక పోయాను, నా మహాపరాధాలన్నిటినీ తెలిసి నన్ను క్షమించమని మనసారా ప్రార్థిస్తున్న ఈవేళ మీరు నన్ను అనుగ్రహించ వచ్చారు. అదే నాకు క్షమా భిక్షలభించిన గుర్తుగా తలుస్తున్నాను స్వామీ !" శ్రీవర్ధనుని చూస్తూ మహర్షి "నీకు జ్ఞానోదయమవటంతో దైవ పరీక్ష ముగిసింది, నీ సింహాసనం తరిగి నీకు లభిస్తుంది." అంటూ శాండిల్య మహర్షి చక్రవర్తిని ఆశీర్వదించినపుడు, చక్రవర్తికి కలిగిన తృప్తీ, ఆనందమూ, వర్ణనాతీతం. నూతన శక్తితో నగరంవేపు నడక సాగించాడు.

నగర ద్వారం దాటి వెళ్ళే సమయంలో ద్వార రక్షకుడు తోటి భటునితో అస్పష్టంగా పలుకుతున్న మాటలు రాజుకు వినవచ్చాయి. " చక్రవర్తి శ్రీవర్ధనులరుగో! కానీ వందనం మటుకు చేయవద్దు. నగరంలో తాను మారువేషంలో సంచరించి నపుడు మనందరం వారిని గుర్తించినా ఊరుకోవలసిందేనని, వందనాలు చేయరాదనీ ఈరోజు ప్రభువు ఆజ్ఞాపించారు" శ్రీవర్ధనుని మనస్సు తేలిక పడింది. రాజ భవనానికి చేరే దారిలో ఉన్నవారంతా గౌరవ మర్యాదలు తొణికిసలాడే నేత్రాలతో తనను చూస్తూ ఉండటం గమనించి శ్రీవర్ధనుడు హర్ష పులకాంకితిడైనాడు.

భవనంలో అడుగు  పెట్టగానే సేవకులంతాతమ చక్రవర్తికి సాగిలపడి నమస్కరించి నపుడు పూర్వమెన్నడూ లేనంత ఆనందమూ, తృప్తీ కలిగాయి. ఒక సేవకుడు  "అంతఃపురంలో మహారాణి చక్రవర్తి కోసం ఎదురుచూస్తున్నారనే వార్త అందించాడు"  "నా ఈపునరాగమనానికి  భగవంతుడే కదా కారణభూతుడు" అనుకుంటూ అంతఃపురంలోకి శ్రీవర్ధనుడు వెళ్ళినపుడు మహారాణి హంసతూలికా తల్పంమీద గాఢనిద్రలో మునిగి ఉండి కనిపించింది. ఆ శయనానికి ప్రక్కగా అచ్చంగా తనని పోలిన ఆ అపరిచిత వ్యక్తి నిలిచి కనిపించాడు. వెనువెంటనే ఆవ్యక్తి రూపంలో మార్పు రాసాగింది . మానవాతీతమైన దైవ కళలతో నిండిన ముఖంలో అపూర్వమైన తేజస్సు వెల్లి విరిసింది. చిత్ర విచిత్ర మైన పట్టుబట్టలను ధరించి పూల దండలలోను శ్రీ చందన భూషణాలతోను శోభాయ మానంగా  అలంకరించబడిన ఆ పరుషునికి ఇరువైపులా రెండు రెక్కలు వ్రేలాడుతూ  శ్రీవర్ధనుని కళ్ళు మిరు మిట్లు గొలిపాయి.

ఆ మహాపురుషుడు "శ్రీవర్ధన చక్రవర్తీ!నీకు స్వాగతం. నేను రత్నాంగదుడనే గంధర్వుడను. దైవశాసనం ప్రకారం ఎల్లప్పుడూ నిన్ను అనుసరించి ఉంటూ, నీలో చేలరేగుతున్న గర్వాహంకార భావాలను ఊహలను గ్రహిస్తూ వచ్చిన నేను సర్వలోక పాలకుడైన పరమైశ్వరుని ఆజ్ఞ పైన ఒక రోజు నీ స్థానాన్ని ఆక్రమించాను. అపారమైన దైవబలం ముందు నీశక్తి  ఎంత అల్పమైనదో  సర్వమూ ఆ సర్వేశ్వరుని దయగానే గ్రహించాలనే జ్ఞానం నీకు కలగటానికి ఈనాటకం జరిగింది. సర్వ శక్తి సంపన్నుడు, సర్వాంతర్యామి అయిన లోకేశ్వరుడు  నీ అజ్ఞానం, అహంకారం అణిగించటానికే నీ సర్వస్వం హరించగా చివరకు శ్రీగురుదేవుల అనుగ్రహంతో జ్ఞానివై, జీవితంలో మరపు రాని, గుణపాఠం నేర్చుకున్నావు. నీ భావి సుఖాల కోసం యీ సూక్ష్మమైన వ్యధను మాత్రమే కలిగించిన దైవాన్ని కీర్తించు. శ్రీగురు నాధుని పాదారవింద భక్తుడవై ముక్తిని సాధించు. అదే మృత్యువును జయించే మార్గం.

నీకు దైవం విధించిన యీ శిక్షను ఎవరూ గుర్తించలేరుగాని, నీలో కొత్తగా కలిగిన సాధుస్వభావాన్ని దయ, సత్యశీలతను, ప్రేమానురాగాలను అందరూ గుర్తిస్తారు. అందరూ అందుకు నిన్నాశీర్వదిస్తారు" అంటూ ఇంద్రధనుస్సులోని రంగులవలె మెరిసే బంగారు రెక్కలను, విప్పుకుని రత్నాకరుడు చేయెత్తి శ్రీవర్ధనుని ఆశీర్వదిస్తూ గగన పథానికి ఎగిసి మాయమైనాడు.

శ్రీగురుపరమేశ్వరుని ఆజ్ఞాపాలనమే కర్తవ్యంగా తలచి, శ్రీవర్ధనునిలో యిక ఎన్నడూ అహకారం అడుగుపెట్టలేదు.

# వర్ణనాతీతం రామనామ మహాత్మ్యం

– వశిష్ఠ

కరెంట్‌తో యంత్రాలను నడపాలంటే జనరేటర్‌కు ఆ యంత్రాలను తీగతో కలిపి, జనరేటర్‌ను కొంత కనీస వేగంతో త్రిప్పాలి. అప్పుడు ఆ యంత్రాలను త్రిప్పటానికి కావలసిన విద్యుచ్ఛక్తి లభిస్తుంది. వేగం తగ్గితే శక్తి చాలదు. వేగం పెంచితే యింకా ఎక్కువ శక్తిని పొందవచ్చు.



అలాగే రామనామం ద్వారా యింద్రియాలను జయించి గొప్ప శక్తిని పొందాలంటే, మనసును ఆ నామానికి తగిలించి వేగంగా త్రిప్పాలి. అంటే మానసికంగా నిర్విరామంగా జపించాలి. ఎంత శక్తినైనా పొందవచ్చు. అంతులేని లాభాలను పొందవచ్చు.

అటువంటి అచంచల భక్తి శ్రద్ధలతో దీక్షతో ఆంజనేయ స్వామి రామనామం జపించాడు. శరీరమంతా మనస్సు ఎలా వ్యాప్తమై ఉంటుందో, అలాగే అతని శరీరము, మనస్సు కూడా రామనామంతో నిండిపోయాయి. ఆయన ఒక్కసారి 'రామ్' అనేసరికి శరీరంలోని అన్ని రోమగ్రంథులు, నాడులు ప్రతిధ్వనించి 33కోట్ల రామనామం ఒక్కసారి జరిగేదట.

కనుకనే ఆయన తన బాహ్యాంతరింద్రియాలను జయించి, జితేంద్రియ నామ ధేయుడై రామునికి అత్యంత అంతరంగిక భక్తుడయ్యాడు. రామునికి జ్ఞానపుత్రుడు అయ్యాడు. జానకికంటె కూడా రామునికి ప్రియమైనవాడయ్యాడు.

అట్టి భక్తుడు తానీ ప్రపంచంలో భగవానుని సేవకునిగా మాత్రమే ఉన్నానని గ్రహిస్తాడు. తన విధ్యుక్త ధర్మాన్ని తత్పరతతో నిరాసక్తుడై నిర్వహిస్తాడు. తాను చేసిన కర్మల ఫలితం మంచిదైనా, చెడుదైనా ప్రభువుకు చెందేదేనని గ్రహించి, ఉబ్బక, కుంగక ఉంటాడు. ఇక అట్టి సేవకుని సంరక్షణ బాధ్యతనంతా ఆ ప్రభువే స్వీకరిస్తాడు.

అందుచేతనే పరమభక్తుడైన కులశేఖరాళ్వారు మహారాజు 'తద్భృత్య భృత్య పరిచారిక భృత్య భృత్యస్యభృత్య యితి మాం స్మర లోకనాథ' – నీ సేవకుల పరిచారకుల సేవకుల సేవకునిగా నన్ను అనుగ్రహించు ప్రభూ! అని వేడుకున్నాడు. (ముకుందమాల 27వ శ్లోకము)

నిజమైన భక్తుడు, మహాత్ముడు తాను భగవానునికి సేవకుడుగా ఉండాలనే కోరుకుంటాడుగాని, నేనే దేవుడనని ఎన్నడూ అనుకోడు, అనడు, అనిపించుకోవటానికి యిష్టపడడు. నిజంగా ప్రభువుకి సేవకుడై ఉండటంలో ఉన్న ఆనందం నిరుపమాన మైనది. అట్టి సేవకుడే నిజమైన ప్రభువు అవుతాడు. వట్టి ప్రభువే కాదు మోక్ష సామ్రాజ్యానికే ప్రభువు అవుతాడు.

రామరత్నము వెలలేనిది. కబీర్‌దాసు కొడుకు కమాల్‌దాస్ చేసిన రామనామ సంకీర్తనకు ముగ్ధుడైన ఒక ధనవంతుడు కమాల్‌దాస్‌కు తెలియకుండానే, అతనికి యిష్టం లేకుండానే ఒక విలువైన వజ్రపు ఉంగరాన్ని అతని ఉత్తరీయం కొంగుకు ముడివేస్తాడు. కమాల్‌దాస్ యింటికి వచ్చాక అది చూసి, భయపడుతూనే తండ్రికి చూపించాడు. ఇక కబీర్ దుఃఖానికి అంతులేదు. తన కుమారుడు మూర్ఖుడై వెలలేని రామరత్నాన్ని, విలువలేని రాయికి అమ్ముకున్నాడని ఆవేదన పడ్డాడు. పొరపాటుగా అయినా అట్టిదానికి తావిస్తే అది అంతులేని నరక కూపంలోకి మానవుణ్ణి త్రోసివేసి, రామ ప్రభువు నుండి శాశ్వతంగా దూరం చేస్తుందని తన కుమారుణ్ణి హెచ్చరించాడు.

'రామ్' అనేది పూర్ణ మంత్రమే. అందులోనే ప్రణవ నాదం పలుకుతుంది. అన్ని ఆయుధాల కంటె అది శక్తివంతమైనది. యయాతి మహారాజు రక్షణ విషయంలో ఏర్పడిన వివాదం వలన రామునికి, ఆంజనేయునికి మధ్య సంభవించిన యుద్ధంలో రాముడు బాణాలను ప్రయోగించగా, మారుతి నిరాయుధుడై, బద్ధాంజలియై రామ నామాన్నే జపించాడు. రామ బాణాలన్నీ తిరిగి రాముని అమ్ములపొదికే చేరుకున్నాయి గాని మారుతి సిగపూవైనా వాడలేదు. రామనామము దేహధారియైన రామునికంటె కూడా శక్తివంతమైనదని మారుతి నిరూపించాడు.

'సర్వహీన స్వరూపోహం' అని రామతత్త్వాన్ని యజుర్వేదం గానం చేసింది. అత్యంత ఆధునిక సూక్ష్మ దర్శినులకు అందని సూక్ష్మాతి సూక్ష్మ వస్తువుల లోపల కూడా యింకా సూక్ష్మమై నిండి ఉండి వాటిని ప్రకాశింపజేస్తూ ఉన్న మహత్తర శక్తియై, పరబ్రహ్మమే రామ తత్త్వమని, తత్త్వాన్ని అలా తెలుసుకున్నవాడు కూడా రాముడై, సర్వహీన స్వరూపుడై, పరబ్రహ్మమై ప్రకాశిస్తాడు. ఈ నశించే దేహం తానుకాదని తెలుసుకుంటాడు.

# శ్రీ దత్తాత్రేయ పరశురామ సంవాదము

- పరాశర ప్రసాద్

శ్రీ జమదగ్ని మహర్షి పుత్రుడైన పరశురాముడు, శ్రీరామచంద్రునితో యుద్ధమునకు తలపడి, ఓడిపోయి, అవమానము పొంది, ఆయన అనుజ్ఞతో శ్రీదత్తాత్రేయుని ఆశ్రయించి, వినయవిధేయతతో నమస్కరించి, తన సందేహ నివృత్తి చేయమని ప్రార్థించారు.



శ్రీపరశురాముడు గురుమూర్తిని ప్రశ్నిస్తూ మీరు బోధించిన "త్రిపురా మహాత్మ్యము విన్నాను కదా. అంతేకాదు మీరు ఆదేశించినట్లు త్రిపురాదేవి ఉపాసన పూర్తి చేశాను. ఆ దేవి నా హృదయంలో మీ రూపంలో సాక్షాత్కరించి ఉంది. ఏ ఉపాసన చేసినా, క్రతువులు ఆచరించినా, ఏ కర్మను ఆచరించినా ఫలము తప్పదు కదా! మానవుడు ఎన్ని కర్మలు ఆచరించినా మృత్యు భయము నుండి రక్షింపబడకున్నాడు కదా! నేను మీ సన్నిధికి చేరటానికి కారకులైన సంవర్తక భగవానుడు ఏ వర్తకము లేకపోయినా ఆనందంగా ఉన్నాడు. ఆయనకు ఏ సంతాపము లేదు. దుఃఖం లేదు. కర్తవ్యం లేదు. ఆయన పొందే సుఖానికి కారణం కర్తవ్య త్యాగమే అనిపిస్తోంది. దానిని సంవర్తుడు పొందిన విధానాన్ని కర్తవ్యమనెడి కాలసర్పము మ్రింగిన తనని దాని నుండి రక్షింపమని గురుదేవునికి సాష్టాంగపడి నమస్కరించి ప్రార్థించాడు శ్రీ భార్గవుడు.



దయాళువైన శ్రీదత్తాత్రేయుడు భార్గవునికి శుభేచ్ఛ కలిగిందని తెలుసుకుని, "పరశురామా! సముద్రంలో మునిగిపోయే వానికి నావ దొరికినట్లు నీకు జ్ఞానోదయమైంది. ఏ కర్మలైతే అల్పమైనవి, వ్యర్థమైనవని భావించావో, ఆ ఉపాసన, క్రతువులే నిన్ను యీ గురుసన్నిధికి తీసుకువచ్చాయి. ఆశ్రయించిన భక్తులను త్రిపురాదేవి అనుగ్రహించి, వారి హృదయంలో చిత్తవృత్తి రూపంగా నిలిచి, మోక్షస్థితికి తీసుకువస్తుంది. మృత్యు వలయం నుండి విముక్తుణ్ణి చేస్తుంది. కర్తవ్యత అనేది సంకల్పరూపమే కదా. చేయ వలసినది ఉన్నదన్న భావనే అజ్ఞానము.

లోకంలో మానవులు కర్తవ్యమనే మోహంలోపడి గుడ్డివారైపోతున్నారు. నీవు ఆ భ్రమ నుండి రక్షింపబడ్డావు. ధన్యుడవు. త్రిపురాదేవి మానవులందరి హృదయాలలో అధిష్ఠించి ఉన్నది. అయితే శుభేచ్ఛ కలిగిన హృదయాలకు విచారణ, చిత్తశుద్ధిని ప్రసాదించి మోక్షసాధానికి చేరుస్తుంది. కాబట్టి ఉపాసన అనేది వ్యర్థం కాదు. అదినిన్ను సక్రమ మార్గంలో నడిపించి మోక్షసాధాన్ని చేర్చటానికి తొలిమెట్టని గ్రహించు" అన్నారు శ్రీదత్తాత్రేయులు.




**కరుణామయుడవైన దశరథ రామా! నీ కథలు అను అమృతమును త్రాగెదను. నీ పాద పద్మముల నుండి పుట్టిన తీర్థమును జుట్టెదను. 'రామ' యనెడి నామోచ్చరణముచే కలిగిన సుధారసమనెడి రుచిని ఎంతో ఆసక్తితో ఆరగించెదను. కాని నీచులైన మనుష్యులతో పొత్తు లేకుండా దయాంతరంగుడవగు నీ పాదములను సేవించెడి రుచులను పొందువారితో నాకు స్నేహమును కూర్చుము.**

(దాశరథీ శతకము - 37)

# ప్రాతః స్మరణీయులు - శ్రీలలితానంద సరస్వతి

- జపమాల ప్రసాద

ఆశ్రమంలో అందరూ ఆప్యాయంగా 'గురువుగారు, అమ్మగారు, అక్కయ్యగారు' అని పిలుచుకునే పూజ్యశ్రీశ్రీశ్రీ లలితానంద సరస్వతీ స్వామిని వారి 17వ, పుణ్యారాధన ఫాల్గుణ శుద్ధ తదియ (మార్చి, 3వ తేదీ)న జరుపుకుంటున్నాము.

"శాన్తా మహాన్తో నివసంతి సంతః। వసన్తవల్లోక హితం చరన్తః। తీర్ణాః స్వయమ్ భీమ భవార్ణవమ్। జనాన హేతునా న్యానపి తారయన్తః" అనే వివేకచూడామణి శ్లోకానికి తగినట్లు తమ దివ్య జీవితాన్ని గడిపిన మహనీయులు అమ్మగారు.

ఇంద్రియ వ్యాపారాలను ఉపశమింప చేసి, వాసనా రహితులైన వారు, ప్రశాంత చిత్తులైనవారు 'శాన్తులు'. వసంత ఋతువు పత్ర, ఫల, పుష్పాదులతో లోకానికి ఆహ్లాదాన్ని కలిగించి, లోకహితానికి ఏవిధంగా ఉపయోగ పడుతుందో, అదేవిధంగా శాంతులైన మహాత్ములు తాము స్వయంగా తరించడమేకాక, నిరపేక్షులై, నిర్హేతుకమైన కరుణతో యితరులును తరింపజేస్తారు. అటువంటి మహామనీషి శ్రీగురువుగారు.

మహాయోగుల వంశంలో 'హనుమత్ జయప్రద'గా ఉద్భవించిన అమ్మగారు, చిన్నవయసులోనే అనేక విషమ పరిస్థితులకు లోనయినా, మొక్కవోని ధైర్యంతో, అకుంఠిత దీక్షతో అధ్యాత్మ సాధనలు చేసి, సంసార సుడిగుండాలని ఎంతో చాకచక్యంగా తప్పించుకొని, ఉన్నత అద్వైత శిఖరాలని అధిరోహించారు.

అలసట, నిద్ర అనే పదాలకి ఆమె జీవితంలో చోటనేదే లేదు. శాంతమే ఆమె రూపం. చిరునవ్వే ఆమెకు భూషణం.

శ్రీబాబూజీ మహరాజ్‌వారు, సాధన విషయంలో మమ్మల్ని మందలించేటప్పుడు, అనేకసార్లు గురువుగారి గురించే ముందుగా చెప్పేవారు. "ఆవిడను చూడండి! ఆమె వయస్సెంత? మీ వయస్సెంత? తెల్లవారుజామున 2-30గంలకి లేచి, ధ్యానానుష్ఠానాలు, పూజ ముగించుకుని, సరిగా 5గం.లకల్లా ప్రార్థనకు వస్తారు. ప్రార్థన అవ్వగానే, రామలింగేశ్వర స్వామివారి అభిషేకాలు, అమ్మగుడిలో పూజలు, అన్నీ పూర్తిచేసుకుని ఏ 9గం.లకో యింటికి వెడుతుంది. అతిథి అభ్యాగతులను

ఏ వేళలో పంపినా, విసుగూ, విరామం లేకుండా వారికి ఫలహారాలు, భోజనాదికాలూ తామే వండి, వారు తృప్తులయ్యేవరకూ తనే స్వయంగా వడ్డిస్తుంది. మాకు నివేదనకు అన్నీచేసి, పూర్తి అయ్యాకనే వారు ఏదైనా తీసుకుంటారు.

ఇక మధ్యాహ్నం పురాణప్రవచనం, సంస్కృతం క్లాసులూ, ఉపనిషత్తులు, గీత క్లాసులు............. రాత్రుళ్ళు దీక్షతీసుకున్న సాధకులని సమావేశపరచి, వేదాంత విచారణ క్లాసులు........ఈ మధ్యలో ఏమాత్రం ఖాళీ దొరికినా, మా దగ్గరకువచ్చి చక్కటి వేదాంత చర్చ చేస్తారు. ఆమె చేస్తున్న సాధనలో, నిర్వహిస్తున్న సేవలలో మీరు 1000వంతు చేసినా చాలు. తరిస్తారు" అనేవారు శ్రీబాబు.

ఇంతేకాకుండా, మాకు వచ్చే సందేహాలన్నీ చక్కగా తీర్చేవారు ఆమె. ఎవరు ఏ టైములో వచ్చి అడిగినా ఏమీ అనేవారు కాదు. ఇతరత్రా బాధలు చెప్పుకొనే వారిని కూడా ఎంతో ఆప్యాయతతో ఓదార్చి పంపేవారు. కార్తీకమాసం వస్తే, రామలింగేశ్వరుడికి లక్షబిల్వార్చనలు, అభిషేకాలు... 'ఓం శ్రీగణపతయే నమః' ... అన్న దగ్గర నుండి చివరి వరకూ ఆవిడ అక్కడే ఉండి అన్నీ నిర్వహించేవారు.

ధనుర్మాసం వస్తే సరేసరి. భాగవత ప్రవచనం గంటలగంటలు... ఏ పండగైనా, నవరాత్రులలోనూ ప్రవచన ప్రభంజనమే!!

అందుకనే శ్రీ మాతాజీవారు చెబుతూ "మా అందరికీ వినికిడి యొక్క విశేషమును నేర్పినది ఆమ్మగారే. దేవుడిగానే తెలిసిన శ్రీబాబూజీని "గురుదేవుడు" అని తెలిపినది యీ ఆమ్మగారే. గురుపూజా విధానానికి ఒరవడి దిద్దినది గురువుగారే" అని ఎన్నో సందర్భాలలో చెప్పారు అమ్మ.

గురుతత్వమంటే, గురువంటేనే తెలియని నాలాటి దాని జీవితం 180 డిగ్రీలు యిటు తిరగటానికి, పరిపూర్ణమైన మలుపు రావడానికి శ్రీగురుదేవులు ఆమ్మగారి ద్వారా పలికించిన దివ్యబోధే. అది మరొకసారి చెప్పుకుందాం. ఇంతటి మహానుభావురాలిని సంస్మరణ చేసుకునే భాగ్యం నాకబ్బినందుకు, ఆమెకు శతకోటి దండ ప్రమాణాలు అర్పిస్తున్నాను.

# నీ లీల పాడెద దేవా!

- సుశీలా ప్రసాద

తమిళ దేశంలో కణ్ణన్ అనే దైవభక్తుడు ఉన్నాడు. భగవంతుని యందు అతనికి సంపూర్ణ విశ్వాసం ఉంది. దైవం తను సృష్టించిన మానవుడికి ఏ లోటూ రాకుండా చూసుకునే ప్రేమమయుడు పరమేశ్వరుడు అని నమ్మినవాడు. అయితే పరమ పిసినిగొట్టు. 10పైసలు దొరుకుతుందంటే 20మైళ్ళు నడచివెళ్ళేరకం. పిల్లాజిల్లాలేని అతను తన భార్యతో కలసి ఒక భోజనశాలలో పనిచేసుకుంటూ పెద్ద ఊరిలో జీవిస్తున్నాడు. భార్య గిన్నెలు తోముతుంది, యితను వంటకి కావలసిన నీళ్ళు బావి నుండి తోడి పోస్తుంటాడు. ఆ పని చేస్తున్నందుకు యిద్దరికి ఒక ముద్ద పెడతారు. కాఫీ, టీ కూడా ఉచితంగా యిస్తారు.

ఒకరోజు అతను ఎవరికో కూలి పని చేస్తుంటే ఒక కాగితం దొరికింది. అది భోజనాల శాల ప్రక్కనే ఆడుతున్న సినిమాహాల్ టికెట్. సినిమా పేరు 'మురిపించే మువ్వలు'. అందులో 'నీ లాల పాడెద దేవా!' అనే పాట వాడికి చాలా యిష్టం. ఎవరో వదిలివేసిన ముక్కాలుపీట మీద కూర్చుని ఆ పాటవచ్చే సమయానికి బయట కూర్చుని వింటూ సంతోషపడేవాడు. తమిళదేశంలో ప్రముఖ నాదస్వర విద్వాంసుడు 'అరుణాచలం' వాద్య సహకారం అందించిన పాట అది.

ఆ రోజు వాడు టిఫెన్ తినకుండా ఆ దొరికిన టికెట్ పట్టుకుని సినిమాకి వెళ్ళాడు. ఆకేలిసింది. అప్పుడే అక్కడ పిడతకందిపప్పు అమ్మే కుఱ్ఱాడు అటుగా వెళుతున్నాడు. ప్యాకెట్ 10పైసలు. అందులో నిమ్మకాయ ముక్కకూడా ఉంది. ఆ కుఱ్ఱాడిని ప్రక్కకి తోసేసరికి, ఆ ప్యాకెట్ క్రిందపడింది. ప్రక్కవాడు చూడకుండా దాన్ని తీసుకుని జేబులో వేసుకున్నాడు. అప్పుడే ఇంటర్‌వెల్ అయింది. బయటకు వెళ్ళాడు ప్యాకెట్ తీసుకుని తిందామని. అందులో రెండు 100 రూపాయల నోట్లు ఉన్నాయి. తిరిగి ఇచ్చేద్దాం అనుకున్నాడు. కానీ మళ్ళా మనసు ఒప్పలేదు. జేబులో పెట్టుకుని యింటికి వెళ్ళాడు.

ఆ సమయంలో ఆ ఊళ్ళోకి 'ఆసియా అహింసా జ్యోతి' అవతార మూర్తి బుద్ధభగవానుడు వచ్చి సత్సంగాలు ఏర్పాటు చేశారు. అందరూ

వెళ్తున్నారు. భార్య సలహా చెప్పింది. ఈ రెండు వందలు ఖర్చుపెట్టి ప్రసాదం చేసి పంచితే మంచిదని. పిడతకిందపప్పు 200రూ॥లకు సరిపడ సరుకులు తెచ్చి తయారుచేశారు. బజ్జీముక్కలు, నిమ్మకాయ అన్నీ కొనుక్కొచ్చారు. పిసినిగొట్టు కదా, 5, 6 బజ్జీలే వేద్దామనుకుంటే అన్నీ కలిసిపోయి 12 అయ్యాయి. అన్నీ తీసుకెళ్ళి బుద్ద భగవానుడికి పెడితే అందరికీ పంచటంతో అది అక్షయం అయింది. ఆ ఊరిలో పేపర్ అచ్చు అవుతోంది. ఎవరో సలహా యిచ్చారు బుద్ధునితో నీ అనుభవాన్ని పేపరులో వ్రాయమని.

10రూపాయలు పారితోషికం లభిస్తే పండ్లు కొని సమర్పించే వాడు. అది అందరికీ పంచండంతో పాటు మిగిలిన ప్రసాదం అంతా అతనికే యిచ్చేవారు. దానితో అతనిలోని పిసినిగొట్టు తనం పోయింది. మనసు కరిగిపోయి భగవంతునిసేవకై తపించేవాడు. ఇప్పుడు ఎక్కడ ఆ పాట వినిపించినా అతనిలో భగవద్భావనే కలిగేది.

భగవత్ప్రసాదం తీసుకోవడం - మహాత్ముల దర్శన- స్పర్శనల వలన జీవిలో ఉండే అవలక్షణాలన్నీ అగ్నిలో పడిన దూదివలె భస్మమయి భగవంతుని సేవకు ఆవేదన పడటం మొదలువుతుంది.

జ్ఞాన సంపదను లేశమాత్రమైనా పొందగలిగితే, అనిర్వచనీయ ఆనందమును చవి చూడగలరు. బాహ్యంగా కనపడే ప్రతి వస్తువూ దాని కథ మీకు చెబుతుంది. దుఃఖ భూయిష్టంగా గోచరించే యీ ప్రపంచమంతా ఆనందనిలయంగా, స్వర్గంగా భాసిస్తుంది.

సద్గురువు తన ఉత్తరాధికారిగా తనవలె ఒక్కణ్ణి మాత్రమే తయారుచేస్తాడు. అతనిని తన ఏకైక వారసునిగా చేసుకుని తన సర్వస్వమును అతనికి అప్పగిస్తాడు. ఆ వారసుడు తనకు సంక్రమించిన పెన్నిధిని, తన శిష్యబృందమునకు పంచిపెడతాడు. వారివారి శక్తి సామర్థ్యాలను యోగ్యతలను బట్టి ఆత్మజ్ఞానమును, శక్తిని నిర్ణీత సమయంలో శిష్యులకు పంచియిస్తాడు.

– శ్రీమెహర్‌బాబా

# సత్సంగామృతం

- మురళీ

(శ్రీ బాబూజీ మహారాజ్‌వారి రజతోత్సవ మహాపుణ్యారాధన మహోత్సవాలలో భాగంగా ది. 24-1-2013 ఆదివారం రోజున శ్రీ మాతాజీ అందించిన బోధామృతం సంక్షిప్తంగా)

మనం భగవద్విషయాన్ని గుర్తించలేకపోతున్నాము. దాన్ని మరచి జీవితం ముందుకు వెళ్ళిపోతోంది. దాని యందు తీవ్ర తపన కావాలి. ఆ తపనే తపస్సుగా మారుతుంది. మనం విన్నటువంటి సద్విషయాన్ని ఒక్కసారి ఆలోచించాలి. మహాత్ముల ద్వారా వచ్చిన తత్త్వాన్ని మనం ఒక్కసారి లేవగానే మననం చేసుకోవాలి. ప్రతివిషయం లోను గుర్తించాల్సినటువంటిది ఎంతోవుంది. ఇప్పుడు విన్నటువంటిది కూడా ఎంతో విచారణ చేసుకోవాలి. ఇలా గడచిన కాలం సద్వినియోగం అవుతుంది. సాధుమహాత్ముల ప్రవచనాలు, సత్సంగాలు యివన్నీ దేనికి? ఎవరు తరించటానికి? ఉదయం లేచిన దగ్గర నుంచి నిద్రించేవరకు అన్ని చింతలలో పడి నీ గురించి మరచిపోతున్నావు. భగవద్విషయము మరుగున పడిపోతోంది. సద్విషయాన్ని మరచిపోయి ఏం చేస్తున్నాము? బ్రతకటానికి తినాలి. తినటం మొదలు పెట్టిన దగ్గర నుంచి రుచులు కావలసి వస్తాయి. ఇది వద్దు, నాకు యిష్టం లేదు అని లేనిది కావాలని పరుగులు పెడుతున్నాం. దానికోసం ఎంతైనా శ్రమిస్తున్నాం. అలాగే కట్టుకునే బట్టల విషయంలో, దాచుకునే విషయంలో ధర్మం, త్యాగం అనేవి మరచిపోతున్నాము. అవి ఎక్కడో వుంటున్నాయి. ధర్మం నీ నడక, త్యాగం నీ రూపం అవ్వాలి. ఇవన్నీ సజ్జన సాంగత్యం చేత గుర్తించగలుగుతాం. కాలం సద్వినియోగ పడతుంది. దీనికి కొలికిపూస ఏది అంటే - సాధుమహాత్ముల బోధ. వారి వాక్కుల ద్వారా వచ్చే మంచి విషయాలను మనం గుర్తిస్తూ ఉంటే, మరుగున పడిన సద్విషయాలు గుర్తువస్తాయి.

మహాత్ములు లభించినందుకు వారి సూచనలను అందుకుంటూ గుర్తించి, అటువంటి మార్గంలో ముందడుగు వేసి, అహర్నిశలూ భగవన్నామంలో జీవితాన్ని ధన్యత చేసుకోవాలి మానవజన్మ. మనస్సు సంకల్పించినటువంటిదాన్ని చిత్తం యిటు, అటు త్రిప్పి మనల్ని చిత్తు చేస్తోంది. చిత్తంలో మార్పు తీసుకొస్తున్నారు మహాత్ములు. గురువుల అవసరం ఏమిటి? ఎన్నో పుస్తకాలున్నాయి ఫిలాసఫీ గురించి చదువుకోవటానికి. ఎన్ని విషయాలు చదివినా భగవద్విషయాన్ని

ఆచరించ లేము. అనుభవించలేం. ఏదైనా పారాయణ చేసేటప్పుడు మనంతట మనం చేసేదానికి, మహాత్ముల వాక్కు ద్వారా వచ్చినదానికి చాలా తేడా ఉంటుంది. పారాయణ చెప్పినప్పుడు మహాత్ములే బాధ్యత తీసుకుంటారు. ముందు నీకు లక్ష్య శుద్ధి, గురువుల మీద విశ్వాసం వుండాలి. ఇది ఫండమెంటల్. అప్పుడు వారు చెప్పింది నీవు చేస్తే, భగవద్గీతైనా, గురుగీతైనా, శివకవచమైనా, సుందరకాండైనా ఫలితాన్ని యిస్తుంది. ఇవన్నీ నీ పుస్తకంలో ఉన్నవే కావచ్చు. 'రామ' నామం కూడా ఎంతో ఫలితాన్నిస్తుంది. అంతేకాదు. మహాత్ముల సన్నిధిలో చెబుతున్నాను, దగ్గరలో ఉన్న మంచినీళ్ల గ్లాసు యిచ్చి త్రాగమంటే, దాని ద్వారా ఎంతో ఫలితం వస్తుంది. అదెలా వస్తుంది? లక్ష్య శుద్ధి కలుగుజేస్తుంది.

భగవద్గీత తాత్పర్యం అక్కడే వ్రాసి ఉంటుంది. అది చదువుకోవచ్చు. కాని గురుదేవుడు చెప్పినప్పుడు దానిలోని భావం, అంతరార్థం విపులీకరించి చెబుతారు. నీ దగ్గర ఎన్నో మంచి లక్షణాలున్నాయి. నిన్ను నువ్వు గుర్తించలేక పోతున్నావు. భగవంతుడు కావలసినట్లుగా నువ్వు తయారవ్వటం లేదు.

నువ్వు ఫలానావారి శిష్యుడనని, ఎంతో పూజ చేస్తానని, ఇంకెంతో పారాయణ చేస్తానని స్వంత డబ్బా కొట్టుకుంటున్నావు. నీ అంతట నీవు చెప్పుకోవటం కాదు, నీ గురించి నీ గురుదేవుడు చెప్పాలి. అందుచేత గురుపాదం ఆశ్రయించినప్పుడు ప్రభువు అనుగ్రహానికి పాత్రులు అవ్వాలి. మహాత్ములు చెప్పినట్లు వినాలి. గురుదేవులు ఏదైనా అంటే, యిలా అన్నారు కదా అని ధిక్కరించి వెళ్లిపోకూడదు. ఆవేదనతో ఏడుస్తూ వారి కృపకోసం ఎదురు చూడాలి. అలాగే పడి ఉంటే, ఏదో క్షణంలో వారి కృప కలుగుతుంది. ఆశ్రమానికి వచ్చింది మాములుగా లోకాభిరామాయణం చెప్పుకోవటానికి కాదు. ఆధ్యాత్మికతను పెంచుకో వటానికి. అందరూ ఆశ్రమానికి వచ్చేయనక్కర్లేదు. ఎవరి స్వధర్మాన్ని వారు ఆచరించాలి. గురుదేవుల దగ్గర నుంచి సూచన లభిస్తుంది. ఆ సూచనలను ఆచరిస్తూ ఉండాలి.

దేవుడు సర్వవ్యాపకుడు. మనల్ని వదలి మనకి దూరంగా వుండేవాడు దేవుడెలా అవుతాడు? దేవుడి సర్వవ్యాపకత్వాన్ని గుర్తింపజేసేవాడు, అనుభవింపజేసేవాడు గురుదేవుడు. అందుకనే ఆయన గురుదేవుడయ్యాడు. నీవు భగవద్విషయాన్ని ఎప్పటి కప్పుడు వింటూ దాన్ని గుర్తించు. భగవంతుడు ఎక్కడ ఉంటానని చెప్పాడు?

అందరి హృదయాలలో ఉంటానని చెప్పాడు. స్వయంగా నీ హృదయంలో ఉంటానని ఎన్నెన్నో సందర్భాలలో చెప్పాడు. 'బహిర్ముఖ సుదుర్లభాయ నమః' భగవంతుని బయట చూడాలంటే చాలా చాలా దుర్లభం. నిన్ను నువ్వు గుర్తించు, భగవంతుడు నీలోనే దాగి ఉన్నాడు. నీలో ఉన్న పరమాత్మని గుర్తించలేక పోతున్నావు. సర్వవ్యాపకుడైన భగవంతుని యీ రూపంతో, యీ కళ్లతో చూడటం దుర్లభం. ముందు భావన చెయ్యి. నీకు ఆశ్రయం యిచ్చిన గురుదేవుల్ని నీ అవలక్షణాలతో యింద్రియ సహితంగా చూడకు. సాక్షాత్తు భగవంతుడు మనకోసం గురు రూపంలో అవతరించాడు. మనల్ని తీర్చిదిద్దటం కోసం, మనల్ని గమ్యస్థానం చేర్చటం కోసం అవతరించిన మహానుభావుడే గురుదేవుడు. మనభక్తిని సిద్ధింప జేయటంకోసం వచ్చిన మహానుభావుడే గురుదేవుడు. నమ్మకం కుదరాలి. కుదిరితే బంగారు పిచ్చుకే. నమ్మితే ఎంతటి మహదావకాశం దొరుకుతుంది! ఆ ప్రేమ యింకోచోట దొరుకుతుందా? ఎవ్వరైనా యివ్వగలరా? సామాన్యమైన ప్రేమా?

చేపలా యీదటం, పక్షిలా ఎగరటంవంటి వాటికోసం తపస్సు చేయాలా? ఆ జన్మ ఎత్తితే సరిపోదూ? మనిషి జన్మ వచ్చినందుకు నిన్ను నీవు గుర్తించు. ఎవరికోసం నిన్ను నీవు గుర్తించటం? ఎవరినో ఉద్ధరింప జేయటానికి కాదుకదా! నీ దగ్గరే ఉంది అమృత భాండమంతా. దాన్ని గుర్తింపజేస్తున్న మహానుభావులు అవతరించినప్పుడు మనకెలా వుంటుంది? ఒళ్ళు పులకరిస్తుంది. గురుదేవుని నరుడిగా చూడకూడదు. ఈశ్వరుడని నమ్ము. గుళ్ళో ప్రతిష్ఠింపబడి, నీ కోర్కెలు తీర్చే ఆ శివుడు ఎవరనుకుంటున్నావు? నీ గురుమూర్తి. అటువంటి గురువులు దొరికినప్పుడు, ఈ జీవితం కలిగినందుకు ఎన్ని సేవలు చేసుకోవచ్చో. అటువంటి మహానుభావుల యొక్క అభయహస్త కిరణాలలో మనం జీవిస్తున్నాము. కాబట్టి మనం దాన్ని మాటిమాటికి గుర్తిస్తుంటేనే మనం తరించగలుగుతాము. మహాత్ములు మన శ్రేయస్సు కోరతారు. శ్రేయోదాయకమైన మార్గమేది అంటే గురుశిక్షణ, గురువాక్కు. మహాత్ములు సూచించిన మార్గాన్ని అనుసరిస్తూ సూచనలను గుర్తించి, ముందడుగువేసి, భగవన్నామంతో, భగవత్తత్వం మన జీవితాలను పునీతం చేసుకుందాం! శ్రీగురుదేవుల అనుగ్రహం మనందరిపై వర్షించుగాక! గురుపాదుకలు సర్వదా రక్షించుగాక! సుఖీభవ! సుఖీభవ!!

# ముళ్ళ కథ

- కె. భాస్కర రాజు

ఒక ఆశ్రమంలో గురుదేవుల సన్నిధిలో ఉదయం భక్తులు అందరూ ఆశీనులై ఉన్నారు. చాలా సమయం గడిచింది. గురుదేవులు ఏమీ మాట్లాడలేదు. కాసేపు గడిచిన తరువాత వారు తమ దగ్గర ఉన్న అంగవస్త్రాన్ని చేతిలోకి తీసుకుని ముడులు వేయటం ప్రారంభించారు. శిష్యుల ముఖాలు ప్రశ్నార్థకంగా మారాయి. ఇటువంటి ప్రశాంత సమయంలో గురుదేవులు చక్కటి బోధ చేసేవారుగదా! ఏమయింది ఈరోజు? అనుకుంటూ ఒకరిముఖాలు ఒకరు చూసుకుంటున్నారు.

అప్పుడు గురుదేవులు "వత్సలారా! నేను యిప్పుడు యీ వస్త్రాన్ని అయిదు ముడులు వేశాను. మళ్ళీ విప్పబోతున్నాను. విప్పేముందు మిమ్మల్ని రెండు ప్రశ్నలు అడగలానుకుంటున్నాను" అన్నారు.

శిష్యులు మనసులో అనుకున్నారు 'ఇందులో పెద్ద అర్థంకాని విషయం ఏముందని' అని. అప్పుడు గురుదేవులు "ఇంతకు ముందు నా చేతిలో ఉన్న అంగవస్త్రము, ఇప్పుడు ముళ్ళతో నా చేతిలో ఉన్న వస్త్రము ఒక్కటేనా?" అన్నారు. శిష్యులకు ప్రశ్న చాలా తేలికగా ఉంది. కానీ అందులో అంతరార్థం ఏమిటా? అని ఆలోచించారు.

ఒక శిష్యుడు లేచి, "అవును గురుదేవా! అదీ యిదీ ఒకటే. కానీ యింతకు ముందు వస్త్రానికి స్వేచ్ఛ ఉంది, యిప్పటి వస్త్రం బంధింప బడి ఉంది" అన్నాడు.

గురుదేవులు చిరునవ్వు నవ్వి, "ఇది ఒక విధంగా ఒకటే వస్త్రం మరొక విధంగా మార్పు ఉంది. అలాగే అందరూ దైవస్వరూపాలే. కాని ముళ్ళు వేసుకుని, బంధాలలోపడి బానిసలై దుఃఖితులౌతున్నారు. ఒక్కొక్కరిదీ ఒక్కొక్కరకమైన బంధం. అది కూడా తాము సృష్టించుకున్న బంధం. అంతులేని సుడిగుండం. సరే మళ్ళీ యిప్పుడు విప్పాలంటే ఏం చేయాలి?" అన్నారు.

ఇంకొక శిష్యుడు లేచి "గురుదేవా! ఈ ముడి విప్పాలంటే ముందు యివి ఎలా పడ్డాయో చూడాలి. ఎలా వేశారో తెలియనంత సేపూ విప్పటానికి మార్గం లేదు. తెలిస్తే విప్పడం తేలిక. దాని యందు

దృష్టిపెట్టి ముడివిప్పితే విప్పటం తేలికవుతుంది. ఒకేసారిగా విప్పటం కుదరదు.

అప్పుడు గురుదేవులు “అవును. ఇదే జీవితం అంటే. మన కష్టసుఖాలూ, దుఃఖాలు యివేవీ యితరుల వల్ల కలిగినవి కావు. మనంతట మనమే తెలిసి కొన్నీ, తెలియక కొన్నీ ఆహ్వానించినవే. అందుకే సాధనలో వివేకమనేది మొదటి మెట్టు. మానవ జన్మ ఎత్తినందుకు, మనకు యివ్వబడిన కాలాన్ని వివేకంతో సద్వినియోగ పరచుకుంటే, యీ జన్మలోనే, యిప్పుడే ముక్తిని పొందవచ్చు. దుర్వినియోగం చేసుకుంటే కంపలాగ ఒక ముల్లు విడితే మరొక ముల్లు తగులుతూ జీవితం ముళ్ళ కంప అవుతుంది. మనం ఎప్పుడు యీ వివేకాన్ని పొందుతామో తెలియటం లేదు” అన్నారు.



ఓ వేమనా! హీనమైన బుద్ధిగలవానికి అధికారము కట్టబెట్టినచో అతడు అక్కడ ఉన్న మంచివారందరినీ వెళ్ళగొట్టును. వారిని అవమానపరుస్తాడు. ఎందుకనగా చెప్పును తినే కుక్కకు చెఱకు తీపి తెలియదు. అట్లే హీనునకు అధికారము వచ్చినను వానికి మంచి గుణములు తెలియవని భావము.

(వేమన శతకము - 20)

# సమర్థ సద్గురు నాథుని దివ్య చరిత్ర

గత సంచిక తరువాయి

- విజయేశ్వరానంద ప్రసాద్

## శ్రీ లలితానంద సరస్వతి స్వామి (గురువుగారి)తో శ్రీబాబు

ఒకసారి చెల్లాయమ్మగారు "అయ్యో పాపం! అంతటి విద్య ఉండి కూడా ఎంతటి దుర్గతి కలిగిందో" అని ఆగ్రహాన్ని గురించి సానుభూతిగా మాట్లాడబోయారు. వెంటనే ఆ గ్రహం "నాకు సద్గతి ఎలాగూ కలుగుతుంది, కానీ ముందు నీ గతేమిటో నువ్వు చూసుకో " అని బదులు చెప్పింది.



"ఇందిర గాజు బొమ్మ వంటిది గదా, దాన్ని ఎలాగో చంపేద్దామనుకుంటే, నువ్వు నాకు మాటి మాటికీ అడ్డం వస్తున్నావు" అని ఆగ్రహం గురువుగారిని సతాయించేది, కాని శ్రీ బాబు కృపవల్ల గురువుగారు ఇందిరకు ఆ గ్రహము వలన ఎటువంటి అపకారమూ జరగకుండా జాగ్రత్త పడ్డారు.

శ్రీబాబు అప్పుడప్పుడు ఇందిర(గ్రహం)తో "అత్తమ్మా! కాసేపు చక్కని బోధ చెప్పు" అని అడిగేవారు. "నేనేమీ చదువుకోలేదులే" అనేది గ్రహం, "నీకు చదువు వచ్చునో రాదో నాకు తెలుసు గాని, నువ్వు ఉపన్యాసం చెప్పు" అనేవారు శ్రీ బాబు. "అయితే నాకు పరుపు, బాలీసులు తెప్పించి ఆసనం వేయించు, అప్పుడు ఉపన్యాసం చెబుతాను" అనేది ఆగ్రహం. శ్రీ బాబు అలాగే ఆసనం వేయించేవారు, ఆగ్రహం ఎంతో ధాటిగా ఉపన్యాసం చెప్పేది.

ఒకసారి శ్రీబాబు అడిగినప్పుడు ఇందిర (గ్రహం) మహావాక్యాలు గురించి అద్భుతంగా ఉపన్యాసం చెప్పింది. శ్రీ బాబు "అత్తమ్మా! ఇంత అనర్గళంగా తత్త్వాన్ని వివరించావు, మరి నువ్వు చదువుకోలేదంటావేమిటి?" అన్నారు. గ్రహం "నువ్వూ అలాగే అంటావుగా? మరి నువ్వు చెప్పే ఉపన్యాసం యింకెంతో దివ్యంగా ఉంటుంది గదా! జ్ఞానానికి, చదువుకీ సంబంధమేమిటి?" అని, సాలెపురుగు, పాము, ఏనుగు, బోయి కన్నప్ప శ్రీ కాళహస్తిలో పరమేశ్వరుని సేవించుకొని ముక్తి పొందిన వైనం ఉదాహరణగా చెబుతూ చక్కగా వివరించింది.

శ్రీ బాబు దివ్యత్వానికి తార్కాణాలు ఎన్ని కనిపిస్తున్నా, గురువుగారు మాత్రము

అప్పటివరకు ఏదో లాంఛన ప్రాయంగా శ్రీ బాబు వద్ద చేతులు జోడిస్తున్నారే గాని, మనస్ఫూర్తిగా నమస్కరించలేదు. శాస్త్ర వాసన వలననో, శ్రీ బాబు వయస్సు తక్కువ అని అనిపించటము వలననో, ఆమెకు దేహాభిమానం అడ్డు పడింది. ఒకరోజున ఇందిరకు గురువుగారితో మజ్జిగ రసం పట్టిస్తూ శ్రీ బాబు ప్రక్కనే కూర్చున్నారు. రసం పట్టటం అయ్యాక గురువుగారు లేవబోయే సరికి, ఇందిర (గ్రహం) ఆమె కాలి బొటన వ్రేలిని తన కాలితో గట్టిగ నొక్కి పట్టుకుంది. గురువుగారు విలవిలలాడిపోతూ 'వదిలి పెట్టవే' అన్నారు. 'శ్రీ బాబుకు నువ్వు త్రికరణ శుద్ధిగా నమనస్కారం చేసుకుంటేనే వదులుతా' నన్నది ఆగ్రహం. అలాగే గురువుగారు మనసార శ్రీ బాబుకు నమస్కరించుకున్నారు. అప్పుడు ఇందిర పట్టు వదిలింది. శ్రీ బాబు నవ్వుతూ కూర్చున్నారు.

అవి 1961 జూన్ నెల చివరి రోజులు . ఇందిరకు కాలేజీ తెరిచే రోజు వచ్చింది. అప్పటికి శ్రీ బాబు కలకత్తాలో ఉన్నారు. కాలేజీ తెరిచే నాటికి ఇందిర హాజరు కాకపోతే, వేసవి శెలవుల జీతం ఇవ్వరు. అయినా శ్రీ బాబు వెళ్ళమని శెలవిస్తేగాని ఇందిరను గుంటూరు తీసుకుని వెళ్ళనని గరువుగారు పట్టుదలగా ఉన్నారు. కాలేజీ తెరచి నెల రోజులు కావస్తోంది.

ఒకరోజు అర్ధరాత్రి ఉన్నట్లుండి ఇందిర నిద్రలేచి,"హనుమాయమ్మా! వెంటనే బయలు దేరి ఇందిరను గుంటూరు తీసుకుని వెళ్ళి కాలేజీకీ పంపించు" అన్నది. నిద్ర లేచిన హనుమాయమ్మ గారికి ఇందిర మాటలు శ్రీ బాబు గొంతుతో శ్రీ బాబు మాట్లాడినట్లే వినిపించాయి. ముందు కంగారు పడిన హనుమాయమ్మ గారు, స్థిరంగా "శ్రీ బాబు శెలవిచ్చేవరకు నేను ఇందిరను ఇక్కడనుంచి కదిలించను" అన్నారు.

ఇందిర (శ్రీ బాబు) తీవ్రంగా "ఈ మాట్లాడుతున్నది ఎవరనుకున్నావు? నేను బాబునే చెబుతున్నాను. తక్షణం బయలుదేరు. నువ్వు సామాను సర్దుకొనే లోపల నేను వెళ్ళి రిక్షా తీసుకుని వస్తాను" అని అన్నది. అప్పటి వరకూ అడుగు కూడా కదపలేనంత నీరసంగా ఉన్న ఇందిర చివాలున లేచి గబగబా అడుగులు వేసుకుంటూ, ఆ అర్ధరాత్రి వేళ రోడ్డుమీదకు వెళ్ళి అయిదు నిమిషాలలో రిక్షా తీసుకుని వచ్చింది. అప్పుడు హనుమాయమ్మ గారికి, శ్రీ బాబే యిలా చేయిస్తున్నారనే నమ్మకం కలిగింది. క్షణాలలో సర్దుకొని వాళ్ళు బయలుదేరి గుంటూరు చేరారు.

-సశేషం

(గతసంచిక తరువాయి) విష్ణు  కథలు -రమణ ప్రసాద్

# 7. రోహిదాసు

"రోహిదాసా! నీ తలిదండ్రులు చేయమన్న పనిని నిస్సంకోచంగా ఆచరించు. కులవృత్తి ఎంత అధమమైనను దానిని ఆచరించటంలో దోషం లేదు. హృదయంలో రాముని రూపాన్ని ప్రతిష్ఠించుకుని, నాలుక మీద రామనామం కదులుతూ ఉంటే, కరచరణాలతో నియమితమైన కర్మలను ఆచరిస్తూ తరించు" అని ఆశీర్వదించి ముందుకు నడిచారు శ్రీరామానందస్వామి.



ఈనాటి నుండి రోహిదాస్‌లో మార్పు వచ్చింది. తన తండ్రి గారి కులవృత్తి చేపట్టాడు. నిరంతరం రామనామాన్ని ఉచ్చరిస్తూ చెప్పలు కుట్టేవాడు. వైష్ణవులకు ఉచితంగా పాదరక్షలు సమర్పించుకునే వాడు. రోహిదాస్‌లో వచ్చిన ఈ మార్పుకు తల్లిదండ్రులు ఎంతో సంతోషించారు.

ఒకనాడు తన తండ్రికి అనారోగ్యం కలిగింది. రాజభవనంలో కాపలాకాయటానికి రోహిదాసును పంపాడు. అర్ధరాత్రి అయింది. రామనామామృతపాన మత్త చిత్తుడికి నిద్ర ఎక్కడిది? రోహిదాసు భగవానుని స్తోత్రం చేయసాగాడు. అర్ధరాత్రి నిశ్శబ్దంగా ఉన్న సమయంలో రోహిదాస్ చేస్తున్న స్తోత్రానికి రాణిగారికి నిద్రాభంగమైంది. ఆమె రాజుగారికి ఫిర్యాదు చేసింది. రాజుగారు రోహిదాస్‌ను పిలిచి విచారణ చేశారు. తను ప్రయత్నపూర్వకంగా నిద్రాభంగం చేయలేదని, తాను భక్తి పారవశ్యంలో అప్రయత్నంగా స్తోత్రాలు చేశానని, తన తప్పును క్షమించమని అడిగాడు. రాజుగారు అతనిని క్షమించి "ఏదీ రాత్రి కీర్తించిన స్తోత్రాలను మళ్ళీ గానం చెయ్యి" అని కోరారు. రోహిదాస్ ఆ స్తోత్రాలను పఠించి వాటి భావం కూడా తెలియ చేశాడు. రోహిదాస్

ప్రజ్ఞా విశేషాలను రాజుగారు అమితంగా మెచ్చుకున్నారు. అధమ కులంలో పుట్టిన రోహిదాస్‌కు ఇంత విజ్ఞానం ఎలా కలిగిందా? అని రాజు విస్మయం పొంది, "రోహిదాసా నీకు ఇంతటి జ్ఞానం ఎలా ప్రాప్తించింది?" అని రాజు అడిగాడు.

రోహిదాస్ నమస్కరించి "ప్రభూ! నాకేమీ తెలియదు. నిరంతరం భగవన్నామం చేయట మొక్కటే నాకు తెలుసు. నామ మహిమ వర్ణనాతీతం. నామం చేసేకొలది ఆనందం వెల్లువలవుతుంది" అంటూ చక్కటి కీర్తనను గానం చేశాడు.

*ప్రభుజీ తుమ్ చందన్ హమ్ సానీ*
*జాకీ అంగ అంగ బాస నమానీ*
*ప్రభు జీ! తుమ్ ఘన బన హమ్ మోరా*
*జైస్ చిత్ వత్ చంద చకోరా* ॥ ప్రభుజీ॥
*ప్రభూజీ! తుమ్ దీపక్‌హమ్‌కు తీ*
*జాకీ జోత్ జలేదిన్‌రాతీ* ॥ ప్రభుజీ॥
*ప్రభూజీ! తుమ్ మోతీహకుధానా*
*జైసే సోనేకి మింత సుహాగా* ॥ ప్రభుజీ॥
*ప్రభుజీ! తుమ్ స్వామీ హకుదాసా*
*ఇస్ భక్తి కర్ రైదాస* ॥ప్రభుజీ॥

"భగవన్నామ మునందు ప్రీతి జనించాలి. అలా జనించిన ప్రీతి నశించదు. నీవు చందనం వంటి వాడవు. మేము జలములాంటి వారము. మమ్ములను సుగంధంతో నింపుచున్నావు ప్రభూ! నువ్వు మేఘము వంటి వాడవు. మేము నిన్ను చూసి నర్తించు నెమళ్ళలాంటి వారము. నువ్వు చంద్రుడి వంటి వాడవు. మేము చకోరాలము. ప్రభూ! నువ్వు దీపము అయితే మేము వత్తి లాంటి వారము నీ వెలుగు చేతనే రాత్రింబవళ్ళు ప్రకాశిస్తాయి.

-సశేషం

Printed, and Published by C.V. Ramana Babu, on behalf of YOGINI SRI CHANDRA KALI PRASADA MATHAJI CHARITABLE TRUST and Printed at Samardha Sadguru Publications, D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh, and published at D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh. Editor - DUGGIRALA JAGANMOHANA BALA KRISHNA LAL